aruhi
aruhi group
MAHAA PRABHA NEWS
Delivering truth with integrity – the voice of the people."
Email : info@mahaaprabha.com
www.mahaaprabha.com - 9160600610





నమస్తే
# మహాప్రభ
ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ
తెలుగు దినపత్రిక
శుక్రవారం
05-06-2026 సంపుటి : 01 సంచిక : 74 పేజీలు : 08 వెల : ₹ 5/-

BESQATI
besqati.com
Contact : info@besqati.com

Published From RANGAREDDY,TELANGANA.తెలంగాణ mahaaprabha.com NAMASTEY MAHAAPRABHA RNI NO : TGTEL/26/A0738 info@mahaaprabha.com

## కేరళను తాకిని నైరుతి రుతుపవనం



- మరో వారంలో తెలంగాణకు చేరుకునే అవకాశం
- కేరళ, తమిళనాడులో భారీ వర్షాల హెచ్చరిక
- ఎల్‌నినో ప్రభావంతో ఆలస్యమైన రుతుపవనాలు
- సాధారణం కంటే తక్కువ వర్షపాతంపై ఐఎండీ అంచనా

**తిరువనంతపురం జూన్ 4 ( మహాప్రభ)**
ఇంతకాలం మండుటెండలతో అల్లాడిపోతున్న ప్రజలకు ఉపశమనం కలిగించేలా చల్లని కబురు వచ్చేసింది. కేరళకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. దాంతో కేరళ తీర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇక అక్కడ ఇనుంచి తమిళనాడు, కర్నాటక,ఆంధ్రాలకు విస్తరిస్తాయి. మరో వారంలోపే ఈ రుతుపవనాలు తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉంది.
-మిగతా 3 లో

## మమతకు మరో షాక్


3 లో

- టీఎంసీని వీడనున్న 20 మంది ఎంపీలు..
- మమతకు వరుసగా ఎదురవుతున్న ఎదురుదెబ్బలు
- ఎమ్మెల్యేల తర్వాత ఎంపీల్లోనూ అసంతృప్తి
- పార్లమెంట్‌లో టీఎంసీ బలానికి గండేనా?
- పార్టీ మార్పుపై ఉన్నతస్థాయిలో చర్చల ప్రచారం
- 28 ఏళ్ల చరిత్రలోనే క్లిష్ట పరిస్థితి
- కాంగ్రెస్ తర్వాత అతిపెద్ద పార్టీ హోదాకు ముప్పు



## ట్రంప్‌కు షాక్

- ఇరాన్‌పై యుద్ధం ఆపేయాలంటూ ప్రతినిధుల సభ తీర్మానం!
- కాంగ్రెస్ అనుమతి తప్పనిసరి అన్న తీర్మానం
- డెమోక్రాట్లకు మద్దతిచ్చిన రిపబ్లికన్లు
- 215-208 ఓట్ల తేడాతో ఆమోదం
- అధ్యక్ష అధికారాలపై నియంత్రణకు ప్రయత్నం
- సెనేట్ ఆమోదం కోసం తదుపరి అడుగు
- వీటో అధికారంపై ఉత్కంఠ

**న్యూయార్క్ జూన్ 4 ( మహాప్రభ)**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు మరో షాక్ తగిలింది. ఇరాన్‌పై సైనిక చర్య నిలిపివేసే తీర్మానానికి అమెరికా ప్రతినిధుల ఆమోదం తెలిపింది. ఇక నుంచి ఇరాన్ మీద మిలిటరీ యాక్షన్ చేపట్టాలంటే కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ఉండాల్సిందేనని ఒక తీర్మానాన్ని పాస్ చేసిందినలుగురు రిపబ్లికన్లు డెమోక్రాట్లతో చేతులు కలపడంతో 215-208 ఓట్ల తేడాతో ఈ తీర్మానం ఆమోదం పొందింది. ఫిబ్రవరి నెల నుంచి ట్రంప్ ఇష్టానుసారంగా మిలిటరీ వ్యవస్థను వాడుతున్నారని.. ఆయన అధికారాలను నియంత్రించేందుకు ఈ తీర్మానం
-మిగతా 3 లో

## పాలమూరుపై సీఎం ఫోకస్

**పాలమూరు ప్రాజెక్టులపై సీఎం రేవంత్ ప్రత్యేక సమీక్ష**

- హెలికాప్టర్‌లో సాగునీటి పథకాల పరిశీలన
- ప్రాజెక్టుల పురోగతిపై అధికారులను ప్రశ్నించిన సీఎం
- కొడంగల్ ఎత్తిపోతల పనులపై ప్రత్యేక దృష్టి
- కీలక నిర్మాణాల స్థితిగతులపై క్షేత్రస్థాయి ఆరా
- పెండింగ్ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి
- రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యం
- గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం

**మహబూబ్‌నగర్, జూన్ 4 ( మహాప్రభ)**
ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమశిలలో ఉన్నతస్థాయి సమీక్ష చేపట్టారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు. జిల్లా పరిధిలోని కీలక సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో విస్తృతంగా ఏరియల్ సర్వే నిర్వహించారు.
-మిగతా 3 లో



## ఉపాధి హామీ పనుల్లో వేగం పెంచాలి

- ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సీసీ రోడ్లు, మ్యాజిక్ డ్రైన్లకు ప్రాధాన్యత ఇవ్వాలి
- పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క



**హైదరాబాద్ జూన్ 4 ( మహాప్రభ)**
మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఈజీఎస్) కింద చేపడుతున్న అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేసి, కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని బీఆర్.అంబేద్కర్ సచివాలయంలో ఎంఎన్ఆర్ఈజీఎస్ పథకం అమలు, పనుల పురోగతి, నిధుల వినియోగంపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి
-మిగతా 3 లో



## కాంగోలో విజృంభిస్తున్న ఎబోలా.

- ఐసోలేషన్ కేంద్రాల్లోంచి 11 మంది రోగులు పరార్..!
- మృతదేహాన్ని వదిలి పారిపోయిన సిబ్బంది
- మానవతా సాయానికి ఆటంకం కలిగిస్తున్న సాయుధ గుంపులు
- కాంగోలో ఇప్పటివరకు 363 ఎబోలా కేసులు నమోదు -- 62 మంది మృతి
- ఉగాండాలో కూడా ఎబోలా వ్యాప్తి -- 15 కేసులు, ఒక మరణం నమోదు

**న్యూఢిల్లీ, జూన్ 4 ( మహాప్రభ)**
ఆఫ్రికా ఖండంలోని కాంగో దేశంలో ఎబోలా వైరస్ విజృంభిస్తున్నది. ఈ క్రమంలో ఎబోలా సోకిన 11 మంది పేషెంట్లు ఐసోలేషన్ కేంద్రాల నుంచి పరారవడం ఆందోళనలు రేకెత్తించింది. ఇదిలావుంటే ఎబోలా వ్యాధితో మృతిచెందిన వారిని ఖననం చేసే బృందం పై కటానా పట్టణంలో మూక దాడి జరిగింది. దక్షిణ కివులోని కటానా పట్టణంలో ఎబోలాతో చనిపోయిన వ్యక్తికి అంత్యక్రియలు చేస్తున్న బృందంపై కొందరు మూక దాడి చేశారు. దీంతో ఆ మృతదేహాన్ని అక్కడే వదిలేసి
-మిగతా 3 లో

## ఇండియా కూటమికి డీఎంకే షాక్!




- జూన్ 8న ఢిల్లీ భేటీ బహిష్కరణ
- కాంగ్రెస్ తీరుపై తీవ్ర ఆగ్రహం.. ద్రోహం చేసిందంటూ మండిపాటు
- శ్రేణుల మనస్తాపం.. క్యాడర్ భావాలకు స్టాలిన్ గౌరవం
- కూటమికి దూరంగా ఉన్నా.. ప్రజా వ్యతిరేక విధానాలపై పోరుకు మద్దతు

**న్యూఢిల్లీ, జూన్ 4 ( మహాప్రభ)**
అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం తమిళనాడులో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఇండియా కూటమికి బీటలు వారాయి. ఇందులో భాగస్వామి అయిన డీఎంకే కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 8వ తేదీన దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగే ఇండియా కూటమి సమావేశాన్ని బహిష్కరించాలని డీఎంకే నిర్ణయించింది. కాంగ్రెస్ పార్టీ పాల్గొనే ఈ భేటీకి వెళ్లే ప్రసక్తే లేదంటూ చెన్నైలోని
-మిగతా 3 లో

## దేశానికి యువతే ప్రాణం

**యువతతోనే మార్పు సాధ్యం**



- బాధ్యతాయుత నాయకత్వం కోసం కృషి
- జనసేన ప్రయాణంలో యువత పాత్ర కీలకం
- రాజకీయాల్లో కొత్త తరానికి అవకాశం రావాలి
- దేశాన్ని ముందుకు నడిపేది యువశక్తే
- ఎక్స్ వేదికగా పవన్ కళ్యాణ్ వెల్లడి

**అమరావతి, జూన్ 4 ( మహాప్రభ)**
తన రాజకీయ ప్రయాణంలో యువత పాత్రను ప్రత్యేకంగా స్మరించుకుంటూ జనసేన అధినేత పవన్ కల్యాణ్.. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. 2008లో ప్రజారాజ్యం పార్టీ(పీఆర్‌పీ) యువజన విభాగం 'యువరాజ్యం' కోసం పటిష్ఠమైన యువజన విభాగం నిర్మించాలని ప్రణాళిక చేశానని తెలిపారు. జనసేన పార్టీని స్థాపించి 12 ఏళ్లలో ఎన్నో కష్టాలు, పోరాటాలను అధిగమించిన తర్వాత..
-మిగతా 3 లో

**50 నుంచి 100 శాతం**

## భూముల విలువ పెంపు

**కీలక వివరాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి**

- జూన్ 5 నుంచి కొత్త రేట్లు అమల్లోకి రానున్నాయని ప్రకటించిన ప్రభుత్వం
- ఈ పెంపుతో ఖజానాకు రూ.1,400 కోట్ల అదనపు ఆదాయం అంచనా
- రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపు లేదని, సబ్-రిజిస్ట్రార్ల అధికారాలకు కోత విధించినట్టు వెల్లడి



**తెలంగాణ బ్యూరో, ప్రతినిధి:**
తెలంగాణలో భూముల మార్కెట్ విలువలను సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. జూన్ 5వ తేదీ నుంచి సవరించిన కొత్త రేట్లు అమల్లోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ, వాస్తవ మార్కెట్ ధరలకు అనుగుణంగా ప్రభుత్వ విలువలను సవరించాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. ముఖ్యంగా డిమాండ్ ఉండే శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, బంజారాహిల్స్ వంటి ప్రాంతాలలో
-మిగతా 3 లో



## ముస్లింలకు 5 మంత్రి పదవులివ్వాల్సిందే.. లేకపోతే తీవ్ర పరిణామాలు


**డీకేకు ముస్లిం నేతల హెచ్చరిక**



**బెంగళూరు జూన్ 4 ( మహప్రభ)**
: కర్ణాటకలో డీకే శివకుమార్ ఆధ్వర్యంలో ఏర్పడిన ప్రభుత్వంలో ముస్లింలకు ఐదు మంత్రి పదవులు కేటాయించాలని ముస్లిం నాయకులు, మత పెద్దలు డిమాండ్ చేస్తున్నారు. ముస్లింల ఓటర్లతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం వారికి మంత్రివర్గంలో తగు ప్రాతినిధ్యం కల్పించకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని వారు హెచ్చరిస్తున్నారు. మత నాయకులు, మత పెద్దలు బెల్లినగర్‌లోని ఒక దర్గాలో బుధవారం సమావేశమయ్యారు.మంత్రివర్గంలో కాంగ్రెస్ నేతలు బీజడ్ జమీర్ అహ్మద్ ఖాన్, ఎన్ఏ హర్రీస్, తన్వీర్ సైత్, సలీమ్ అహ్మద్‌లకు స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్‌ను ఖాతరు చేయకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. అసెంబ్లీ స్పీకర్‌గా యూటీ ఖాదర్‌ను నియమించిన క్రమంలో మిగిలిన నలుగురికి మంత్రి పదవులు ఇవ్వాలని కోరారు. అలా కాకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని ఒక నేత హెచ్చరించారు.

## సరోగసీ కేంద్రాల ద్వారా చైల్డ్ ట్రాఫికింగ్..

**సుప్రీంకు అమికస్ నివేదన**



**న్యూఢిల్లీ, జూన్ 4 ( మహప్రభ)**
ఫెర్టిలిటీ క్లినిక్‌లను నియంత్రించే నిబంధనల చట్రంలోని లోపాలను ఆసరాగా చేసుకుని పిల్లల అక్రమ రవాణా కొత్త నెట్‌వర్క్‌లు పుట్టుకొస్తున్నాయనే ఆందోళనలు వ్యక్తమైన నేపథ్యంలో అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ(ఏఆర్‌టీ), సరోగసీ కేంద్రాల ద్వారా పిల్లల అక్రమ రవాణాను నిరోధించడానికి ఒక ప్రత్యేక యంత్రాంగం అవసరాన్ని సుప్రీంకోర్టు పరిశీలిస్తున్నది.ఏఆర్‌టీ, సరోగసీ కేంద్రాల ద్వారా జరిగే అక్రమ రవాణాను నివారించడానికి ఎటువంటి ప్రామాణిక కార్యాచరణ విధానం(ఎస్‌వోపీ) లేదని పేర్కొంటూ అమికస్ క్యూరీ సీనియర్ న్యాయవాది అపర్ణాభట్ చేసిన వాదనలను పింకీ వర్సెస్ ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం బాలల అక్రమ రవాణా కేసులో తమ 2025 ఏప్రిల్ తీర్పు అమలును ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది.

## 30 అత్యవసర ఔషధాల ధరలు తగ్గింపు

**-రెండు మూడు నెలల్లో అందుబాటులోకి..**


**-జాబితాలో డయాబెటిస్, బీపీ మందులు కూడా**



**న్యూఢిల్లీ, జూన్ 4 ( మహప్రభ)**
షుగర్, హై బీపీ, హృద్రోగాలు, ఇన్‌ఫెక్షన్లు, మహిళల ఆరోగ్య సమస్యలకు వాడే 30 అత్యవసర ఔషధాల ధరలను సవరించాలని నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పీసీఏ) నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో దీర్ఘకాలం ఈ వ్యాధులకు చికిత్స పొందుతున్న పౌరుల చికిత్స ఖర్చు తగ్గనుంది.అయితే ఈ తగ్గించిన ధరలు రోగులకు వచ్చే రెండు మూడు నెలల్లో అందుబాటులోకి వస్తాయని పరిశ్రమకు చెందిన ప్రతినిధులు తెలిపారు. ప్రస్తుతమున్న మందుల స్టాక్ పూర్తిగా అయిపోయిన తర్వాతే కొత్త మందుల అమ్మకం ప్రారంభమవుతుందని వారు చెప్పారు.

## 10వ తరగతి టీచర్లతో 12వ తరగతి పేపర్ల మూల్యాంకనం

**మరో వివాదంలో సీబీఎస్ఈ**



**న్యూఢిల్లీ, జూన్ 4 ( మహప్రభ)**
ఆన్ స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) విధానం ప్రవేశపెట్టి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) మరో నిర్వాకం వెలుగు చూసింది. 12వ తరగతికి ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెట్టిన ఓఎస్ఎం విధానంలో అర్హత గల ఉపాధ్యాయులతో కాకుండా 10వ తరగతి టీచర్లతో జవాబు పత్రాలను మూల్యాంకనం చేయించారు. ఢిల్లీ పేరెంట్స్ అసోసియేషన్‌కు చెందిన అపరాజిత గౌతమ్ దీనికి సంబంధించిన పలు నిజాలను వెల్లడించారు.

# గిరి ప్రదక్షిణలో గ్యాంగ్ రేప్..

**-అరుణాచలంలో అమానుషం**
**-ఇద్దరు మహిళలపై సామూహిక లైంగికదాడి**
**-8 మంది నిందితుల అరెస్ట్..**



**తిరువణ్ణామలై, జూన్ 4 ( మహప్రభ)**
: తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రం తిరువణ్ణామలై (అరుణాచలం)లో దారుణాలు చోటుచేసుకున్నాయి. గిరి ప్రదక్షిణకు వచ్చిన ఇద్దరు యువతులపై ఒక ముఠా సామూహిక అత్యాచారానికి పాల్పడింది. ఈ దారుణానికి పాల్పడిన ముఠాలోని 8 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. అందులో ఒకరు మైనర్ కూడా ఉన్నాడు. వేర్వేరుగా జరిగిన ఈ ఘటనల వివరాలిలా ఉన్నాయి. తమిళనాడులోని ధర్మపురికి చెందిన ఒక వివాహిత గత నెల 30న తన స్నేహితులతో కలిసి గిరి ప్రదక్షిణకు వచ్చింది. ప్రదక్షిణ పూర్తయిన తర్వాత వీరితో వచ్చిన వారు ముందు వెళ్లగా, పెద్ద కోలాపాడి వద్ద ఆమె, మరో స్నేహితుడు వాహనం ఆపి మాట్లాడుకుంటుండగా, మారణాయుధాలతో వచ్చిన ఒక ముఠా వారిని బెదిరించింది. తర్వాత వారిని అటవీ ప్రాంతానికి తీసుకువెళ్లింది. వివాహితపై ఆ దుండగులు సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు.తర్వాత వారిని నగ్నంగా చేసి వీడియో తీశారు. మరునాడు ఆ వివాహితకు ఆ వీడియోను పంపి లక్ష రూపాయలు ఇవ్వాలంటూ బెదిరించారు. దీంతో ఆమె రూ.4 వేలు చెల్లించింది. తర్వాత ధర్మపురి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తిరువణ్ణామలై పడమర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. తిరువణ్ణమలైలో ఇలాంటి ఘటనే మరునాడు సంభవించింది. మే 31వ తేదీన తిరువణ్ణామలై మున్సిపాల్టీ పరిధికి చెందిని 23 ఏండ్ల యువతి గిరి ప్రదక్షిణకు వచ్చింది. గిరిప్రదక్షిణ చేస్తుండగా కాళ్లు నొప్పులు పుట్టడంతో అడిఅన్నామలై అనే గ్రామం వద్ద కూర్చుని తన స్నేహితుడిని పిలిచింది. తర్వాత ఇద్దరూ కలిసి సమీపంలోని హోటల్‌లో టిఫిన్ పార్సిల్ కట్టించుకుని అయ్యంపాలయం బైపాస్ రోడ్ వద్దకు వెళ్లగా, అక్కడ ఒక ముఠా వారిని బెదిరించి అటవీ ప్రాంతానికి తీసుకువెళ్లింది. అక్కడ ఇద్దరినీ చిత్రహింసలు పెట్టారు.

# ఫారో దీవుల్లో ఘోరం..

**-700 కుపైగా తిమింగళాలు, డాల్ఫిన్‌ల ఊచకోత..!**



**న్యూఢిల్లీ, జూన్ 4 ( మహప్రభ)**
నార్త్ అట్లాంటిక్ సముద్రంలోని ఫారో దీవుల్లో ఘోరం జరిగింది. అక్కడి సంప్రదాయమైన 'గ్రైండాడ్రాప్' ఉత్సవంలో భాగంగా ఏకంగా ఒక్క రోజులో 700కు పైగా తిమింగలాలు, డాల్ఫిన్ల ను ఊచకోత కోశారు. దాంతో సముద్ర తీరం ఎర్రగా మారిపోయింది. మే 27న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రపంచ సముద్ర పర్యావరణ సంస్థ 'సీ షెఫర్డ్ (గాము రాష్ట్రవజూష్ట్రవతీస)' ప్రకారం.. టోర్షావన్‌లో సాండెగెర్ది బే వద్ద వేటగాళ్లు 402 పైలట్ తిమింగలాలను , నాలుగు బాటిల్‌నోస్ డాల్ఫిన్‌లను ఒడ్డుకు తీసుకొచ్చి.. వాటి శరీరాలని చీల్చారు.అదేవిధంగా స్కాలబోట్నూర్‌లో 168 వైట్ సైడెడ్ డాల్ఫిన్‌లు, హోల్విక్‌లో 132 వైట్ సైడెడ్ డాల్ఫిన్‌లను చంపేశారు. వాటిని చంపేందుకు ఉపయోగించే ఆయుధాల కొరత ఏర్పడటంతో.. కొక్కేలు, కత్తులు ఉపయోగించి వాటి శరీరాలను చీల్చేశారు. దాంతో అవి ఒడ్డున విలవిలా కొట్టుకుంటూ ప్రాణాలు వదిలాయి. ఈ వధను చిన్నారులు సహా అనేకమంది సముద్రపు ఒడ్డున ఉండి చూడటం గమనార్హం. సీ షెఫర్డ్‌లోని ఫారో దీవుల డైరెక్టర్ వాలెంటీనా క్రాస్ట్.. దీన్ని తీవ్రంగా ఖండించారు. అమాయక జంతువులను ఇంత క్రూరంగా బాధించి చంపడాన్ని సమర్థించలేమన్నారు.ఈ సందర్భంగా ఈ సంప్రదాయాన్ని నిషేధించాలని డిమాండ్ చేశారు. కాగా ఈ సామూహిక వధ అనేది 1000 ఏళ్ల నాటి సంప్రదాయంగా అక్కడి వారు చెబుతున్నారు. అయితే జంతు ప్రేమికులు దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఆధునిక కాలంలో ఇది అనాగరికమైన చర్య అని, కాలం చెల్లిన పద్ధతిగా దీన్ని అభివర్ణిస్తున్నారు. వెంటనే దీన్ని ఆపేయాలంటూ ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నారు. ఈ సామూహిక వధకి ముందురోజు ఫారోస్ పార్లమెంటులో వేటాడే డాల్ఫిన్‌ల కోసం ఉన్న సంక్షేమ చట్టాన్ని సవరించడం గమనార్హం.

# ఏళ్ల తర్వాత తొలిసారి భారత్‌కు స్కాండినేవియన్ విమానం..


**- మధ్యలోనే యూ టర్న్**




**న్యూఢిల్లీ, జూన్ 4 ( మహప్రభ)**
సుమారు 17 ఏళ్ల విరామం తర్వాత స్కాండినేవియన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన తొలి విమానం భారత్‌కు ప్రయాణమైంది. ముంబైలో వెల్‌కమ్ ల్యాండింగ్ కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. అయితే ఆ విమానం మధ్యలోనే యూ టర్న్ తీసుకుని వెనక్కి వెళ్లిపోయింది. జూన్ 2న స్కాండినేవియన్ ఎయిర్‌లైన్స్ (ఎస్ఏఎస్)కు చెందిన ఎస్‌కే 969 ఫ్లైట్ డెన్మార్క్ రాజధాని కోపెన్‌హాగన్ ఎయిర్‌పోర్ట్ నుంచి టేకాఫ్ అయ్యింది. సుదీర్ఘ విరామం తర్వాత భారత్‌లో తన కార్యకలాపాల విస్తరణ ఆశతో ఉన్న ఆ సంస్థ తొలి విమానం ముంబైకు ప్రయాణమైంది. ఆ విమానం తొలి ల్యాండింగ్ సందర్భంగా స్వాగతం పలికేందుకు ముంబై ఎయిర్‌పోర్ట్‌లోని గ్రౌండ్ సిబ్బంది వాటర్ కెనాన్ సెల్యూట్ కోసం సిద్ధమై వేచి ఉన్నారు.కాగా, విమానం బయలుదేరడానికి ముందు భారత్ నుంచి తుది అనుమతులు స్కాండినేవియన్ ఎయిర్‌లైన్స్‌కు అందలేదు. ఫ్లైట్ టేకాఫ్ తర్వాత అనుమతుల ప్రక్రియ పూర్తవుతుందని ఆ సంస్థ భావించింది. అయితే ల్యాండింగ్ అనుమతుల అంశంలో స్పష్టత లేకపోవంతో ఆ విమానం మధ్యలోనే యూటర్న్ తీసుకున్నది. ఈ నేపథ్యంలో సుమారు 12 గంటల పాటు అందులో ప్రయాణించిన ప్రయాణికులు తిరిగి బయలుదేరిన కోపెన్‌హాగన్‌లోనే దిగారు.మరోవైపు ప్రయాణికులకు కలిగిన ఇబ్బందికి స్కాండినేవియన్ ఎయిర్‌లైన్స్ క్షమాపణలు చెప్పింది. వారికి ప్రత్యామ్నాయ విమాన ప్రయాణ ఏర్పాట్లు చేసినట్లు తెలిపింది. భారత్ నుంచి మిగిలిన అనుమతులు పొందేందుకు సంబంధిత ప్రభుత్వ అధికారులతో కలిసి పనిచేస్తున్నట్లు పేర్కొంది. వారానికి ఐదుసార్లు నడిచే కోపెన్‌హాగన్– ముంబై సర్వీసును కొన్ని రోజుల్లోనే పునఃప్రారంభిస్తామని వెల్లడించింది. అయితే భారత్‌కు తొలి విమాన సర్వీసులో అంతరాయం కారణంగా స్కాండినేవియన్ ఎయిర్‌లైన్స్ సంస్థ భారీ ఆర్థిక నష్టాన్ని చవిచూసింది. ఇంధనం, నిర్వహణ ఖర్చులు, ప్రయాణికులకు నష్టపరిహారం కోసం అర మిలియన్ డాలర్లకు పైగా నష్టం వాటిల్లవచ్చని నిపుణులు అంచనా వేశారు. భారత్‌కు తొలి సర్వీసులోనే ఆ సంస్థకు నిరాశ, భంగపాటు ఎదురైనట్లు పేర్కొన్నారు.

# రాజ్యసభకు 11 మంది అభ్యర్థుల్ని ప్రకటించిన బీజేపీ..

**పోటీలో ఉన్నది వీరే**



**న్యూఢిల్లీ, జూన్ 4 ( మహప్రభ)**
: రాజ్యసభకు జరగనున్న ఎన్నికలకు సంబంధించి 11 మంది అభ్యర్థుల్ని బీజేపీ ప్రకటించింది. ఇందులో ఒడిశాకు జరగనున్న ఉప ఎన్నికలో పోటీ చేసే అభ్యర్థిని కూడా ప్రకటించింది. రాజ్యసభలో ఖాళీ అయ్యే స్థానాలకు రెండేళ్లకోసారి ఎన్నికలు జరుగుతాయి. అవి ఈ ఏడాదికి సంబంధించి జూన్ 18న జరగనున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ ఉన్నతస్థాయి సమావేశం న్యూఢిల్లీలో జరిగింది.ఈ సమావేశంలో చర్చించిన అనంతరం బీజేపీ తన అభ్యర్థుల్ని ప్రకటించింది. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ ఈ జాబితాను విడుదల చేశారు. రాజస్థాన్ నుంచి సతీష్ పూనియా, అల్కా గుర్జార్, మధ్యప్రదేశ్ నుంచి తరుణ్ చుగ్, రజ్నీష్ అగర్వాల్, అరుణాచల్ ప్రదేశ్ నుంచి తాయ్ తగాక్, గుజరాత్ నుంచి రాజుభాయ్ శుక్లా, ముకేష్ భాయ్ రత్వా, మాన్‌సింగ్ పర్మార్, జితేంద్ర మేఘ్‌జిభాయ్ కంజారియా , మణిపూర్ నుంచి శార్దా దేవి, ఒడిశా నుంచి శ్రీ దేవాసిష్ సమంతరాయ్ బీజేపీ తరఫున పోటీ చేస్తున్నారు. ఈ స్థానాల్లో బీజేపీ విజయం ఖాయమని ఆ పార్టీ భావిస్తోంది. జూన్ 18న 24 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.మొత్తం 10 రాష్ట్రాల్లో ఈ ఎన్నికలు జరుగుతాయి. ఇందులో ఏపీతోపాటు తమిళనాడు, ఒడిశా, మహారాష్ట్ర, మేఘాలయ, ఝార్ఖండ్, మిజోరం, కర్ణాటక కూడా ఉన్నాయి. ఏపీలో నాలుగు స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. అందులో 3 సీట్లు టీడీపీకి, ఒక సీటు జనసేనకు దక్కాయి. తమిళనాడులోని ఒక స్థానాన్ని టీవీకే కూటమి.. కాంగ్రెస్ పార్టీకి కేటాయించింది.

# పాలమూరుపై సీఎం ఫోకస్

మొదటి తరువాయి


ముఖ్యమంత్రి , మంత్రుల బృందం పాలమూరు జిల్లాలోని పలు ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను ఆకాశ మార్గం ద్వారా క్షుణ్ణంగా పరిశీలించింది. ముఖ్యంగా కోయిల్ సాగర్ ప్రాజెక్టు, కృష్ణా-భీమా నదులపై ప్రతిపాదించిన నూతన బ్యారేజీల స్థలాలు, , జూరాల ప్రాజెక్టు డ్యామ్‌ను సీఎం రేవంత్ రెడ్డి వీక్షించారు. ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిగతులు, నీటి నిల్వ సామర్థ్యం తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి తన సొంత నియోజకవర్గ పరిధిలోని కొడంగల్ ఎత్తిపోతల పథకం పనుల పురోగతిని ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ పథకంలో అత్యంత కీలకమైన కాట్రేవుపల్లి పంప్ హౌస్ వద్ద జరుగుతున్న పనుల



నిర్మాణ శైలిని, పురోగతిని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా వీక్షించారు. ఈ ప్రాంతానికి సాగునీరు అందించడంలో ఈ ప్రాజెక్టు ఎంతో కీలకం కానుండటంతో దీనిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. ఏరియల్ సర్వే అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడారు. పాలమూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పనులన్నింటినీ యుద్ధప్రతిపాదికన వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎలాంటి జాప్యం లేకుండా, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మంత్రుల బృందం కూడా ప్రాజెక్టుల వారీగా ఉన్న అడ్డంకులను తొలగించి, పనులను త్వరగా ముగించాలని అధికారులకు సూచించింది.

# కేరళను తాకిని నైరుతి రుతుపవనం

మొదటి తరువాయి



అయితే గతంతో పోలిస్తే ఈసారి నైరుతి రుతుపవనాలు కొంత ఆలస్యంగా వచ్చాయి. వాస్తవానికి మే 26వ తేదీననే నైరుతి రుతపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ముందుగా అంచనా వేసింది. కానీ, ఎల్‌నినో ప్రభావంతో ఆ అంచనాలు తలకిందుల య్యాయి. కాగా రుతుపవనాల ప్రభావంతో ఇప్పటికే కేరళలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. అలప్పుళ, కొట్టాయం, ఎర్నాకుళం జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీచేసింది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో అటు తమిళనాడులోని 15 జిల్లాల్లోనూ రానున్న కొన్ని గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరిక జారీచేసింది. ఇదిలావుంటే.. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది నైరుతి రుతుపవన కాలంలో (జూన్-సెప్టెంబర్) సాధారణం కంటే తక్కువ వర్షపాతమే నమోదవుతుందని వాతావరణ విభాగం అంచనా వేసింది. దీర్ఘకాల సగటుతో పోలిస్తే 90శాతం వర్షమే ఈ సీజన్‌లో కురిసే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నది. పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో ఎల్‌నినో పరిస్థితులు ఆవిర్భవిస్తున్నాయని, జూన్‌లో ఇవి బలహీనంగా ఉన్నా సెప్టెంబర్‌లో మాత్రం బలంగా ఉండే అవకాశం ఉందని తెలిపింది.

# మమతకు మరో షాక్

- టీఎంసీని వీడనున్న 20 మంది ఎంపీలు..
- మమతకు వరుసగా ఎదురవుతున్న ఎదురుదెబ్బలు
- ఎమ్మెల్యేల తర్వాత ఎంపీల్లోనూ అసంతృప్తి
- పార్లమెంట్‌లో టీఎంసీ బలానికి గండేనా?
- పార్టీ మార్పుపై ఉన్నతస్థాయిలో చర్చల ప్రచారం
- 28 ఏళ్ల చరిత్రలోనే క్లిష్ట పరిస్థితి
- కాంగ్రెస్ తర్వాత అతిపెద్ద పార్టీ హోదాకు ముప్పు



**కోల్‌కతా**

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి అనంతరం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న టీఎంసీ అధినేత్రికి మరో భారీ షాక్ తగిలే అవకాశం ఉంది. ఇప్పటికే పార్టీకి చెందిన సుమారు 60 మంది ఎమ్మెల్యేలు చీలిపోయి వేరే కుంపటి పెట్టుకున్నారు. ఇంకా ఆ షాక్ నుంచి తేరుకోని మమతకు పార్టీకి చెందిన ఎంపీలు కూడా అదే మార్గంలో పయనించేందుకు రంగం సిద్ధం చేసుకుంటుండటంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితిలో ఉన్నారు. 28 ఏండ్ల పార్టీ చరిత్రలో ఎన్నడూ లేని సంక్షోభాన్ని టీఎంసీ ఎదుర్కొంటున్నది. టీఎంసీకి చెందిన ఎంపీల్లో సగం మంది బీజేపీలో చేరుతారనే ప్రచారం ఊపందుకుంది. సుమారు 20 మంది ఎంపీలు కమలం పార్టీలో చేరేందుకు ఉన్నత స్థాయిలో చర్చలు జరుపుతున్నారని వార్తా కథనాలు వెలువడుతున్నాయి. ప్రస్తుతం టీఎంసీకి లోక్‌సభలో 28 మంది, రాజ్యసభలో 13 మంది కలిపి మొత్తం 41 మంది ఎంపీలు ఉన్నారు. వీరిలో 20 మంది పార్టీని మారితే పార్లమెంట్‌లో ఆ పార్టీ బలం సగానికి తగ్గిపోతుంది. ప్రస్తుతం పార్లమెంట్‌లో కాంగ్రెస్ తర్వాత అత్యధిక ఎంపీలున్న పార్టీ టీఎంసీయే.

# ట్రంప్‌కు షాక్

మొదటి తరువాయి



ప్రవేశపెట్టినట్టు ప్రతినిధుల సభ చెప్పింది. ఈ తీర్మానానికి సెనేట్ ఆమోదం అవసరం ఉంది. ఒకవేళ అక్కడ కూడా పాస్ అయితే అప్పుడు అధ్యక్షుడి వీటో అధికారాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది.

# ఉపాధి హామీ పనుల్లో వేగం పెంచాలి

మొదటి తరువాయి

మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రస్తుతం మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.589 కోట్ల నిధులు అందుబాటులో ఉన్నాయనీ, వీటిని పూర్తిస్థాయిలో ఖర్చు చేయడం ద్వారా అదనంగా మరో రూ.600 కోట్ల వరకు నిధులు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ క్రమంలో జిల్లాల వారీగా స్పష్టమైన కార్యాచరణ రూపొందించి, ఒక్క రూపాయి కూడా వెనక్కి వెళ్లకుండా అన్ని నిధులను సద్వినియోగం చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. రైతులకు ఉపయోగపడే పొలం బాటల నిర్మాణం, మరమ్మతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. గ్రామీణ రవాణా సౌకర్యాలు మెరుగుపడితే వ్యవసాయ ఉత్పత్తుల రవాణా సులభతరం అవుతుందని, రైతులకు అదనపు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు.

# ఇండియా కూటమికి డీఎంకే షాక్!



మొదటి తరువాయి

డీఎంకే ప్రధాన కార్యాలయం గురువారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ తమకు తీవ్ర ద్రోహం చేసిందంటూ డీఎంకే సంచలన ఆరోపణలు చేసింది. కాంగ్రెస్ పార్టీ వైఖరితో డీఎంకే శ్రేణులు తీవ్ర మనస్తాపం చెందాయని వివరించింది. అందులో భాగంగా కేడర్ భావాలను గౌరవిస్తూనే ఇండియా కూటమి భేటీకి దూరంగా ఉండాలని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం ఎం.కె. స్టాలిన్ నిర్ణయం తీసుకున్నట్లు ఆ ప్రకటనలో వివరించింది. జూన్ 8వ తేదీన ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ వేదికగా ఇండియా కూటమి అత్యవసర సమావేశం జరగనుంది. ఈ కూటమి సమావేశానికి హాజరు కావాలని ఆ పార్టీ భాగస్వామ్య కూటమిల నుంచి డీఎంకేకు ఆహ్వానం అందింది. అయినప్పటికీ.. హాజరు కాకూడదని డీఎంకే అధిష్ఠానం నిర్ణయించింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ ప్రవర్తించిన తీరుపై డీఎంకే శ్రేణుల్లో తీవ్ర ఆగ్రహం వచ్చింది. తమ పార్టీ కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీ చేసిన ద్రోహాన్ని క్షమించేది లేదంటూ డీఎంకే ఒక ప్రకటన విడుదల చేసిన విషయం విదితమే. ఇండియా కూటమి ఏర్పడినప్పటి నుంచి డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ కీలక పాత్ర పోషించారని ఈ సందర్భంగా డీఎంకే గుర్తు చేసింది. నీట్, ఒకే దేశం-ఒకే సారి ఎన్నికలు, వక్ఫ్ చట్టాలకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో తమ పోరాటం కొనసాగుతుందని డీఎంకే వెల్లడించింది. కూటమితో భేటీకి దూరంగా ఉన్నప్పటికీ, ప్రజా వ్యతిరేక విధానాలపై ఇతర పార్టీల పోరాటాలకు మద్దతు ఇస్తామని డీఎంకే ప్రకటించింది. దీంతో డీఎంకే - కాంగ్రెస్ బంధంలో వివాదం ముదిరినట్లు అయింది. అంతేకాకుండా జాతీయ స్థాయిలో ప్రతిపక్ష కూటమికి డీఎంకే భారీ షాక్ ఇచ్చినట్లు అయింది.

# దేశానికి యువతే ప్రాణం

మొదటి తరువాయి

పార్టీ కార్యకర్తలు ఇప్పుడు అనుభవం, పరిణితితో నిండి, సంస్థాగత బాధ్యతలు చేపట్టడానికి, రాజకీయాలు నిర్వహించడానికి, ప్రజా సమస్యలు పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ యువరాజ్యం యువజన విభాగానికి పవన్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. 2005 నుంచి ఇప్పటి వరకు తనను విశ్వసించి అండగా నిలిచిన యువతకు పవన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నిజాయితీ, నిబద్ధత, దేశభక్తి కలిగిన యువతను, చైతన్యవంతమైన నాయకులను తీర్చిదిద్దేందుకు తాను కృషి చేస్తానని పవన్ ప్రతిజ్ఞ చేశారు. నూతన భారత్.. జెన్‌జెడ్ తరం నుంచి అద్భుతమైన నాయకుల ఆవిర్భావానికి సాక్ష్యంగా నిలుస్తుందన్నారు. జెన్‌జెడ్ తరం.. బుజ్జగింపు రాజకీయాలు, వంశపారంపర్య రాజకీయాలు, కుల రాజకీయాలు, విభజన రాజకీయాలు, ప్రాంతీయ రాజకీయాలతో విసిగిపోయిందని అభిప్రాయపడ్డారు. ఈ తరం.. జవాబుదారీతనం గల రాజకీయాలను తీసుకురాగల నాయకుల కోసం ఎదురుచూస్తోందని చెప్పారు. అంతేగానీ, ప్రపంచ వేదికలపై భారత్‌ను బలహీనపరిచే నాయకుల కోసం కాదన్నారు. బలమైన, పటిష్ఠమైన భారత్‌ను నిర్మించగల నాయకుల కోసం జెన్‌జెడ్ యువత ఎదురుచూస్తోందని ఎక్స్ ఖాతాలో పవన్ కల్యాణ్ పోస్ట్ చేశారు.

# లాసెట్‌లో మెరిసిన దేవ్‌జీ

**-ఆరు పదుల వయస్సులో గన్ను వదిలి పెన్ను పట్టిన మావోయిస్ట్ మాజీ నేత**
**-గత నెల 18న లాసెట్‌కు హాజరు**
**-రాష్ట్ర స్థాయిలో 349వ ర్యాంకు**




**కోరుట్ల,**

సుదీర్ఘకాలంపాటు గన్ను పట్టి పోరాటాలు చేసిన మావోయిస్టు పార్టీ మాజీ అగ్రనేత, కోరుట్లకు చెందిన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ లాసెట్‌లో మెరిశారు. విప్లవోద్యమం నుంచి జనజీవన స్రవంతిలోకి అడుగుపెట్టిన ఆయన, కృషి, పట్టుదల ఉంటే ప్రతిభకు వయస్సు అడ్డంకి కాదని నిరూపించారు. ఆరు పదుల వయసులో గత నెల 18న ఐదేండ్ల న్యాయవిద్యను అభ్యసించడానికి ప్రవేశ పరీక్ష రాశారు. గురువారం విడుదలైన ఫలితాల్లో 349వ ర్యాంకు సాధించి ఔరా అనిపించారు.

# కాంగోలో విజృంభిస్తున్న ఎబోలా.

మొదటి తరువాయి



ఆ బృందం పారిపోయింది.దీంతో స్థానికులే అంత్యక్రియలు నిర్వహించాల్సి వచ్చింది. దీనివల్ల వైరస్ మరింత వేగంగా వ్యాప్తిచెందే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇక ఇటూరిలో ఉన్న ఐసోలేషన్ కేంద్రాల నుంచి 11 మంది ఎబోలా రోగులు పారిపోయారు. అదే సమయంలో కొన్ని ప్రావిన్స్‌లలో సాయుధ మూకలు మానవతా సాయానికి ఆటంకం కలిగిస్తున్నాయి. దాంతో అక్కడి భద్రతా పరిస్థితులపై ఆందోళనలు నెలకొన్నాయి. కాంగో జాతీయ ప్రజారోగ్య సంస్థ నివేదిక ప్రకారం.. దేశంలో ఇప్పటివరకు 363 ఎబోలా కేసులు నమోదయ్యాయి.బుండిబుగ్యో వైరస్ కారణంగా 62 మంది మరణించారు. వ్యాధి సోకిన వారిని కనుగొనడంలో కొంత మెరుగుదల కన్పించినట్లు అధికారులు తెలిపారు. ఉగాండాలో కూడా 15 కేసులు నిర్ధరణ కాగా.. ఒక మరణం సంభవించింది. ఆఫ్రికా దేశాల్లో ఎబోలా కేసులు పెరుగుతుండటంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలు అప్రమత్తమయ్యాయి. ప్రభావిత దేశాల నుంచి వచ్చే ప్రయాణికులను స్క్రీనింగ్ చేస్తూ అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి

# మోదీ హయాంలో విద్యావ్యవస్థ నాశనం’



**న్యూఢిల్లీ:**

నీట్ విద్యార్థిని బలవన్మరణంపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. వదేపదే జరుగుతున్న పేపర్ లీక్ వివాహాల వల్ల విద్యార్థుల కలలు చెదిరిపోతున్నాయని మండిపడ్డారు. మోదీ హయాంలో నాశనమైన విద్యా వ్యవస్థకు భారతదేశ యువతరం మూల్యం చెల్లిస్తోందని పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లోని మోగంజ్ జిల్లాకు చెందిన ఆకాంక్ష అనే నీట్ అభ్యర్థిని నీట్ అక్రమాలపై మానసికంగా ఒత్తిడికి గురై నాగపూర్‌లో బలవన్మరణానికి పాల్పడినట్లు మీడియాలో వచ్చిన కథనాలపై రాహుల్ సామాజిక మాధ్యమం ఎక్స్ లో పోస్టు పెట్టారు. “ఆకాంక్ష డాక్టర్ అయ్యి సమాజానికి సేవ చేయాలని ఆశపడింది. ఓ సాధారణ రైతు అయిన ఆమె తండ్రి, కుమార్తె కలను నిజం చేయడానికి కిసాన్ క్రెడిట్ కార్డ్ ద్వారా 3లక్షలు అప్పు తీసుకున్నారు. నాగపూర్‌లో ఆమె శిక్షణ తరగతులకు వెళ్లేందుకు వీలుగా తండ్రి వంటవాడిగా ఉద్యోగం చేశారు. ఓ తండ్రిగా ఆయన చేయగలిగినదంతా చేశారు, కానీ నీట్ పేపర్ లీక్ కారణంగా పరీక్ష రద్దయింది. పరీక్ష రద్దు కావటాన్ని తట్టుకోలేక ఆకాంక్ష బలవన్మరణానికి పాల్పడిది. ఆకాంక్ష మరణం కేవలం బలవన్మరణం కాదు, అది ప్రధాని మోదీ హయాంలో అవినీతి, కుమ్మక్కైన విద్యావ్యవస్థ చేసిన ఘోర పాపం. ఇక ధర్మేంద్ర ప్రధాన్ విషయానికొస్తే? ఆయన ఈపాటికే తన పదవిలో గట్టిగా పాతుకుపోయి ఉన్నారు. అవే పాత కమిటీలు, బదిలీలు, విచారణలు. సంస్కరణలు లేవు న్యాయం లేదు.”-- రాహుల్ గాంధీ.

## 50 నుంచి 100 శాతం

# భూముల విలువ పెంపు

మొదటి తరువాయి

పెంపు ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. అయితే, రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెంచే ఆలోచన లేదని మంత్రి స్పష్టం చేశారు. అదే సమయంలో, పరిపాలనలో పారదర్శకత పెంచేందుకు సబ్-రిజిస్ట్రార్ల అధికారాలను గణనీయంగా తగ్గించినట్టు తెలిపారు. కొత్త రేట్లపై ప్రజల సందేహాలు, ఫిర్యాదుల కోసం ప్రత్యేకంగా ఒక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయనున్నట్టు హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ హయాంలో అసైన్డ్ భూములకు రిజిస్ట్రేషన్లు జరగవని అన్నారు. తమ ప్రభుత్వం వాటిని నిషేధిత జాబితాలో పెట్టిందని అన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం గురించి కూడా మంత్రి మాట్లాడారు. ఈ పథకం కోసం ఇప్పటివరకు రూ.7,000 కోట్లు విడుదల చేశామని, ఒకవేళ కేంద్రం నుంచి నిధులు రాకపోయినా రాష్ట్ర ప్రభుత్వమే బిల్లులు చెల్లించి ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తుందని భరోసా ఇచ్చారు.



# సంపాదకీయం

## తెలంగాణలో సెంటిమెంట్ రాజకీయం !



తెలంగాణను ముంచిన వారంతా ఇప్పుడు వీరతాళ్లు వేసుకుని..నా తెలంగాణ అంటూ ఊరేగుతున్నారు. విగ్రహాల పేరుతో కొందరు నిగ్రహం కోల్పోయి మాట్లాడుతున్నారు. తెలంగాణ అస్తిత్వం ప్రమాదంలో పడ్డదని వాపోతున్నారు. ఇప్పుడు తెలంగాణ సెంటిమెంట్ కోసం మళ్లీ రాజకీయ రగడ మొదలయ్యింది. ఎవరికి వారు తామే తెలంగాణ భావి విధాతలమని మాట్లాడుతున్నారు. పవన్ కళ్యాణ్‌ను బూచిగా చూపి ఎవరికి తోచినట్లు వారు మాట్లాడుతున్నారు. నిజానికి తెలంగాణ ఏర్పడ్డ తరవాత జరిగిన ద్రోహం, అంతకుముందు ఎప్పుడూ జరగలేదు. ఉమ్మడి ఎపిలో జరగనంత దోపిడీ గత 12 ఏళ్లుగా సాగుతోంది. ఎక్కడిక్కడ భూములు దోచుకున్నారు. అప్పుల చేసి దోచుకున్నారు. తెలంగాణను అప్పుసుల కుప్పచేసి అనుభవిస్తున్నారు. ఎవరికి వారు తామే తెలంగాణను ఉద్ధరించామని చెప్పుకుంటున్నారు. నిరుద్యోగ సమస్య తీరలేదు. నీటి సమస్యలు తీరలేదు. నిధులు పారించలేదు. అంతెందుకు రైతులు పండించిన ధాన్యం మద్దతు ధరలకు కొని సేకరణ సక్రమంగా చేయడంలో కూడా విఫలం అయ్యారు. మక్క, జొన్న, మిర్చి, పత్తి రైతులు ఏటా పడుతున్న కష్టాలను పట్టించుకోని అసమర్థులుగా మిగిలి పోయారు. ఇకపోతే తెలంగాణలో కొత్తగా ఆస్తులు సృష్టించలేదు. అయినా పాలకులుగా పనిచేసిన వారు తామే తెలంగాణను ఉద్ధరించామని ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. ప్రజలకు పెన్షన్లు, ఇళ్లు, ఆరోగ్యశ్రీలు ఎరగా వేసి దర్జాగా దోచేస్తున్నారు. నిజానికి ఉమ్మడి ఎపి నుంచి తెలంగాణ విడివడ్డాక తెలంగాణ అభివృద్ధి చెందిందా..లేక అప్పుల పాలయ్యిందా అంటే..అప్పుల పాలయ్యిందని లెక్కలు చెబుతున్నాయి. సమయానికి జీతాలు ఇవ్వలేని వారు పాలకులు అయ్యారు. హైదరాబాద్ మీ అయ్య జాగీరా అని జనసేనాని పవన్ కళ్యాణ్ అనగానే కొందరు ఒంటి కాలిపై లేచి..అవును మా అయ్య జాగీరే అంటున్నారు. ఎందుకంటే మూడో వ్యక్తి వస్తే..దోచుకోవడానికి అవకాశం ఉండదు కనుక...ఎగిరెగిరి పడుతున్నారు. తెలంగాణ సమాజాన్ని బెదిరిస్తున్నావంటూ పవన్‌ను చీల్చి చెండాడేంత పని చేశారు. పవన్ మీడియా సమావేశంలో మాట్లాడిన మాటలు నిజంగానే తెలంగాణలోని కొందరికి బాధ కలిగించాయి. అందులో అనుమానం లేదు. రాజకీయంగా తెలంగాణలో ఉన్న కొందరు జనసేనలోనూ ఉన్నారు. వారికి పదవులు రావాలంటే జనసేన పక్షాన పోటీ చేయాల్సిందే. రాజకీయ పార్టీ అన్న తరవాత పోటీకి సై అంటుంది. జనసేన కూడా అదే చేసింది. అయితే మిగతా ప్రాంతాలకు, తెలంగాణకు ఓ రేఖ అడ్డంగా ఉంది. అదే సెంటిమెంట్. తెలంగాణ ప్రజలను ముంచిందే సెంటిమెంట్. ఆ సెంటిమెంట్‌తోనే ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డది. అది అడ్డం పెట్టుకునే కెసిఆర్ కుటుంబం పదేళ్లు దర్జాగా తెలంగాణలో పాగా వేసి, ఇష్టారాజ్యంగా దోచుకున్నది. పదవులు, డబ్బులు, భూములు దోచేసారు. లక్షల కోట్లు తెలంగాణ నెత్తిన అప్పులు పెట్టారు. తరవాత గత రెండేళ్లుగా కాంగ్రెస్ కూడా అదే దారిలో నడుస్తోంది. అభివృద్ధి పేరిట ఊదరగొట్టిన కాంగ్రెస్ నేతలు పప్పు బెల్లాల్లా తెలంగాణను పంచుకుంటున్నారు. భూములు యధేచ్ఛగా అమ్మేస్తున్నారు. ఈ క్రమంలో పవన్ రాకతో మరోమారు సెటిమెంట్ రగిల్చి బాగుపడాలన్న ధోరణిలో పొన్నం ప్రభాకర్, కెటిఆర్, కవితలు తామే అసలుసిసలు తెలంగాణ వారుసులమని చెప్పుకునే ప్రయత్నంలో పడ్డారు. తెలంగాణ సమాజం అస్తిత్వ సంక్షోభంల పడుతున్నదనీ గొంతు చించుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మరోసారి ఆంధ్రా ఆధిపత్యం కిందకు వెళుతోందని ప్రకటించుకున్నారు. పవన్ కళ్యాణ్ ఎంట్రీ వెనక బిజెపి, మోడీ ఉన్నారని ఆరోపిస్తున్నారు. తెలంగాణ కూడా భారతదేశంలోనే ఉందని, అందుకు బిజెపి ఎక్కడైనా పావులు కదుపుతుందని తెలుసుకోవాలి. బిజెపికి తెలంగాణ కూడా ఒక రాష్ట్రమని తెలుసు. ఇక్కడ పాగా వేయాలని ఎప్పటనుంచో కలలు కంటోంది. కనుక దాని ప్రయత్నాల్లో అది ఉంది. ఇది రాజకీయం. కెసిఆర్ కూడా భారత రాష్ట్ర సమితి అంటూ దేశాన్ని ఏలుతానని అన్ని రాష్ట్రాలు తిరిగారు. దానిని ఎవరైనా తప్పుపట్టారా అన్నది కెటిఆర్ చెప్పాలి. రాజకీయ పార్టీ పెట్టి ఇక్కడ వైఎస్ షర్మిల కూడా పాదయాత్ర చేశారు. తాను తెలంగాణ బిడ్డనని ప్రకటించుకున్నారు. అప్పుడు లేని రోషం ఇప్పుడే ఎందుకు వచ్చిందన్నది ప్రశ్న.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం స్వరాష్ట్రంలో ఆంధ్రా వలసవాదం పెరిగింది. దానికి కెసిఆర్ ఆద్యులు. ఆయనే మాకు ఆంధ్రాతో పేచీ లేదంటూ..జగన్‌ను పిలిచి భోజనం పెట్టి అలయ్ భలయ్ చేసుకున్నారు. కృష్ణా నీటిని ఎపికి దోచి పెట్టారని వస్తున్న ఆరోపణలకు కెసిఆర్ బృందం నుంచి సమాధానం లేదు. తెలంగాణలో అధికారాన్ని చేజిక్కించుకుని, హైదరాబాద్ సంపదను కొల్లగొట్టడానికి వస్తున్నారని జనసేనాని పవన్ కళ్యాణ్‌ను విమర్శించే ముందు..ఇక్కడ ఎంత కొల్లగొట్టారో చెప్పాలి. ధరణి పేరుతో మోసాలు. కాళేశ్వరం పేరుతో దగా. టెలిఫోన్ ట్యాపింగ్. అస్మదీయులకు రాజ్యసభ పదవులు.. ఇలా చెప్పకుంటూ పోతే కథలు కోకొల్లలు. ఇప్పుడు రెండేళ్ల పాలనలో మంత్రులందరిపైనా అవినీతి గుప్పు మంటోంది. అయినా ఎవ్వరు కూడా మాట్లాడడం లేదు. తెలంగాణ మేధావులు నోరు మెదపడం లేదు. కాంగ్రెస్ వచ్చాకనే స్వేచ్ఛ వచ్చిందని కోదండరామ్ సార్ అంటున్నారు. అంటే కెసిఆర్ ఉన్నంతకాలం నిరంకుశ పాలనలో మగ్గామనే అర్థం కదా. తెలంగాణ అస్తిత్వం మీద దాడిలో, మోదీ, చంద్రబాబుల ఉమ్మడి ప్రణాళిక దాగి ఉందని ఘోషిస్తున్న వారు, ఏ రకమైన దాడి జరిగిందో చెప్పాలి. ఈ గడ్డపై నివస్తిస్తూ ఇక్కడే మమేకమైన వారంతా తెలంగాణ బిడ్డలే. వాళ్ల పిల్లల భవిష్యత్తు, వారి ఉద్యోగాలు, వ్యాపారాలు అన్నీ ఈ తెలంగాణ రాష్ట్రంతోనే ముడిపడి ఉన్నాయి. రాజకీయ పార్టీలు అన్ని చోట్లా తమ అస్తిత్వం కోసం ప్రయత్నం చేస్తుంటాయి. కెసిఆర్ కుటుంబానికి చెందిన పార్టీలే తెలంగాణకు ప్రతినిధులు కాదు. తెలంగాణ కోసం కష్టపడే వారు ఎవరైనా రాజకీయలు చేసుకునే హక్కు ఉంటుంది. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో, ఆ తర్వాత జరిగే సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి పోటీ చేసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీనిని తప్పుపట్టడానికి లేదు. ఉమ్మడి రాష్ట్రంలో అధికారం చలాయించిన సమైక్య పాలకులు, తెలంగాణ ఏర్పాటుతో అధికారం చేపట్టిన వారు కూడా తెలంగాణను నిలువునా దోచుకున్నారు. కాబట్టి ఎవ్వరు కూడా తెలంగాణ అస్తిత్వం కోసం పోరాడలేదు. తమ స్వార్థ రాజకీయం కోసమే పోరాడారు. ఇంకా పోరాడుతున్నారు. ఇప్పుడు రాష్ట్ర విభజన జరిగిన తర్వాత కూడా ఇదే సెంటిమెంటుతో తమ ఉనికి కోసం కొందరు ఇప్పుడు నానా యాగీ చేస్తున్నారని గుర్తిస్తే మంచిది.

## మద్యం సేవించి వాహనం నడిపిన 8 మంది వాహనదారులకు జరిమానా.



**తూప్రాన్, జూన్ 4 (మహాప్రభ)**
గురువారం తూప్రాన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా, మద్యం సేవించి వాహనాలు నడిపిన 8 మంది వాహనదారులపై కేసులు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ గంగరాజు తెలిపారు. వారికి కోర్టు ద్వారా ఒక్కొక్కరికి 10,000 చొప్పున మొత్తం 80,000 జరిమానా విధించ బడినదను పేర్కొన్నారు. అదేవిధంగా, ఈ-పెట్టి కింద 4 కేసులు నమోదు చేయగా, వాటికి సంబంధించి మొత్తం 40,000 జరిమానా వసూలు చేయడం జరిగింది. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, మద్యం సేవించి వాహనాలు నడపకుండా తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను సైతం కాపాడాలని తూప్రాన్ పోలీసులు సూచించారు.

## దాతర్ పల్లి గ్రామసభలో పాల్గొన్న ఆర్డీవో.



**తూప్రాన్, జూన్ 4 (మహాప్రభ)**
మండలంలోని దాతర్ పల్లి గ్రామపంచాయతీ సమీపంలోని మహిళ భవనంలో గ్రామసభను ఏర్పాటు చేయడం జరిగింది. తూప్రాన్ ఆర్డీవో జయచంద్ర రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని ముఖ్యమైన సూచనలను తెలిపారు. ముఖ్యంగా గ్రామంలో బహిర్భూమికి వెళ్ళకూడదని, ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకూడదని, ఇంకుడు గుంతల నిర్మాణం చేసుకోవాలని, స్వీయ మరుగుదొడ్ల నిర్మాణం చేసుకోవాలని అన్నారు. అంతేకాకుండా వ్యవసాయదారులు ఒక్క వరి పంటపై ఆధార పడకూడదని కూరగాయ పంటలు, ఆయిల్ ఫామ్, పండ్ల తోటలను నిర్మించు కోవాలని తెలిపారు. తద్వారా ఇలాంటి పంటలు వేయడం ద్వారా ఇబ్బంది ఉండదని ప్రతి వ్యవసాయదారుడు ప్రభుత్వానికి సహకారం అందించాలని తెలిపారు. ఇందులో గ్రామ సర్పంచి జయరాములు, ఎస్సై గంగరాజు, ఎమ్మార్వో చంద్రశేఖర్ రెడ్డి, అగ్రికల్చర్ అధికారి గంగుమల్లు, సెక్రటరీ, పాలకవర్గం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనపూర్ లో గ్రామసభ.



**తూప్రాన్, జూన్ 4,(మహాప్రభ)**
మండలంలోని ఘనపూర్ గ్రామంలో గురువారం గ్రామపంచాయతీ సమీప భవనంలో గ్రామసభను ఘనపూర్ సర్పంచ్ సబ్బని వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో సతీష్, పోలీస్ సిబ్బంది హాజరయ్యారు. ఈ నేపథ్యంలో గ్రామంలో అర్హులైన వారికి గత కొన్ని సంవత్సరాలుగా వృద్ధాప్య వితంతు పింఛన్లు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అధికారులతో తెలిపారు. తక్షణమే మాకు పింఛన్లు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అర్హులైన వారు కోరారు. అనంతరం ఎంపీడీవో సతీష్ మాట్లాడుతూ గ్రామంలో బహిరంగ మలవిసర్జన చేయకూడదని, నీటిని పొదుపు చేసుకోవాలని, ఎక్కడపడితే అక్కడ చెత్త చెదారం వేయకూడదని స్వీయ మరుగుదొడ్ల నిర్మాణం చేసుకోవాలని సూచించారు. మరి ముఖ్యంగా భూగర్భ జలాలు అడుగంటి పోకుండా నీటి స్వీయ సంరక్షణ ఏర్పాటు చేసుకోవాలని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఇందులో గ్రామ సెక్రెటరీ సంగమేశ్వర్, ఉప సర్పంచ్, పాలకవర్గం సభ్యులు, అంగన్వాడీ టీచర్లు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అండర్ డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఏఈ మధు.



**తూప్రాన్, జూన్ 4 (మహాప్రభ)**
తూప్రాన్ మండలం వెంకటాయపల్లి గ్రామంలో అండర్ డ్రైనేజీ జామ్ కావడంతో ఏ ఈ. మధు అక్కడికి వెళ్లి ఎక్కడ అండర్ డ్రైనేజీలో ఇబ్బంది ఏర్పడిందో ఆ స్థలాన్ని పరిశీలించారు. అండర్ డ్రైనేజీ లో ఏర్పడ్డ అవకతవకలను తక్షణమే సరిచేయాల్సిందిగా గ్రామపంచాయతీ సిబ్బందితో సూచించారు. ఇందులో గ్రామ సర్పంచ్ హరీష్ గౌడ్, ఉప సర్పంచ్, పాలకవర్గం సభ్యులు ఉన్నారు.

## ఉపాధి కూలీల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



**పాలకుర్తి, జూన్ 4 (మహాప్రభ)**
పాలకుర్తి మండలం కొత్తపల్లి గ్రామంలోని జారుబండ ప్రాంతంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్ గురువారం సందర్శించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని, ఉపాధి హామీ పథకం గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించడంతో పాటు వారి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుస్తోందని తెలిపారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున కూలీలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. వడదెబ్బ తగలకుండా టోపీలు, గ్లూకోవిటా పానీయాలను అందజేశారు. పనులు జరుగుతున్న ప్రాంతంలో అత్యవసర మెడికల్ కిట్ అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మనాలి ఠాకూర్, సర్పంచ్ తోట స్వప్న మహేష్, ఉప సర్పంచ్ బండ కుమార్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు మల్లెత్తుల శ్రీనివాస్, అమ్ముల కుమారస్వామి, ఫీల్డ్ అసిస్టెంట్ బుట్టి శ్రీనివాస్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.ఉపాధి కూలీల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ స్పష్టం చేశారు.

## బడిబాట పోస్టర్లను ఆవిష్కరించిన డిఇఓ ప్రశాంత్ రెడ్డి



**కరీంనగర్,జూన్ 4 (మహాప్రభ)**
మంకమ్మతోట ప్రాంతంలోని పిఎం శ్రీ జిహెచ్ఎస్ ధన్గర్వాడి పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట ప్రచార పోస్టర్లను జిల్లా విద్యాశాఖాధికారి కె. ప్రశాంత్ రెడ్డి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఎస్ఎస్సి 2026 ఫలితాల్లో పాఠశాల అత్యుత్తమ ప్రతిభ కనబరిచిందని, ప్రభుత్వ పాఠశాలలు కూడా కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్య అందించగలవని నిరూపించాయని అభినందించారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి కోసం ఉపాధ్యాయులు డిజిటల్ ల్యాబ్‌లు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక మౌలిక వసతులు, డిజిటల్ తరగతులు, ఉచిత ఆంగ్ల మాధ్యమ విద్య అందుబాటులో ఉన్నాయని, రాబోయే విద్యా సంవత్సరానికి విస్తృత ప్రచారం ద్వారా మరిన్ని విద్యార్థులను చేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి జయపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు మాగంటి శ్రీనివాస్, బి. జ్యోతి, వి. రాజేష్, వి. శ్రీదర్ రెడ్డి, సాయి వరూధ్ తదితరులు పాల్గొన్నారు.ప్రభుత్వ పాఠశాలల ప్రగతి ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల ప్రతిభతో సాధ్యమవుతోందని డిఇఓ ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## ఎల్‌నినో ముప్పు -- ఆరుతడి పంటల వైపు రైతులు





**పాలకుర్తి, జూన్ 4 (మహాప్రభ)**
ఈ వానాకాలంలో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు.పాలకుర్తి మండలంలోని బసంత్‌నగర్, ఈసాలతక్కలపల్లి, ఎలకలపల్లి గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సమావేశాల్లో వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ మాట్లాడుతూ, వరిలో స్వల్పకాలిక రకాలను మాత్రమే సాగు చేయాలని, నీటి వినియోగం తక్కువగా ఉండే పప్పు ధాన్యాలు, నూనెగింజలు వంటి ఆరుతడి పంటలను ప్రోత్సహించాలని రైతులకు సూచించారు.పంట అవశేషాలను కాల్చడం వల్ల భూసారం క్షీణత, వాయు కాలుష్యం పెరుగుతుందని హెచ్చరిస్తూ, వాటిని భూమిలో కలిపి సేంద్రియ పదార్థాలుగా మార్చుకోవాలని సూచించారు. మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్న సన్నరక వరి వంగడాలను నాటడం ద్వారా రైతులు లాభాలు పొందవచ్చని తెలిపారు. రైతులు శాస్త్రీయ పద్ధతులు పాటించి, ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని అధికారులు పిలుపునిచ్చారు.ఎల్‌నినో ముప్పు నేపథ్యంలో ఆరుతడి పంటలే రైతులకు భద్రతాయుతమైన మార్గమని వ్యవసాయ శాఖ అధికారులు స్పష్టం చేశారు.

## దేవరకొండ నూతన ఆర్డీఓ పద్మప్రియను మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్టీఐఏఎస్ రాష్ట్ర అధ్యక్షులు డా. కొర్ర కిషన్ నాయక్



**దేవరకొండ జూన్ 4 (మహా ప్రభ)**
దేవరకొండ డివిజన్ నూతన రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) గా బాధ్యతలు స్వీకరించిన శ్రీమతి పద్మప్రియ నుగురువారం ఆర్టీఐ యాక్టివిస్ట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొర్ర కిషన్ నాయక్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సమావేశంలో భాగంగా దేవరకొండ డివిజన్ పరిధిలోని పలు ప్రజా సమస్యలు, పరిపాలనాంశాలపై చర్చించారు. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రభుత్వ పాలనలో పారదర్శకతను పెంచేందుకు, నిరుపేదలకు, అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ కొర్ర కిషన్ నాయక్ మాట్లాడుతూ..."నూతన ఆర్డీఓ పద్మప్రియ నాయకత్వంలో దేవరకొండ డివిజన్ లోని రెవెన్యూ వ్యవస్థ మరింత బలోపేతం కావాలని, ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కారం కాగలవని ఆశిస్తున్నాం. సమాచార హక్కు చట్టం కార్యకర్తలకు, ప్రజలకు పరిపాలనను మరింత చేరువ చేయడంలో నూతన అధికారిణి చొరవ చూపాలని ఆర్టీఐఏఎస్ రాష్ట్ర అధ్యక్షులు డా,, కొర్ర. కిషన్ నాయక్ కొరినారు.

## రామాయంపేట పట్టణంలో గంటలపాటు కురిసిన భారీ వర్షం



**రామాయంపేట జూన్ 4 మహా ప్రభ**
రామాయంపేట పట్టణంలో ఈదురుగాలులు ఉరుములు. మెరుపులతో కూడిన భారీ వర్షం మధ్యాహ్నం నుండి మూడు నాలుగు గంటల వరకు వర్షం కురిసింది దీనితో రోడ్డుపై ఉన్న దాన్యం త డసి ముద్దవ్వడంతో రైతులు కన్నీరు మున్నీరయ్యారు ధాన్యాన్ని తొందరగా కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నామని వారిని వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు ఇకనైనా ప్రభుత్వం స్పందించి వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని వర్షాలు స్టార్ట్ అవడంతో తొందరగా ధాన్యాన్ని కొనుగోలు చేసి మాకు న్యాయం చేయగలరని వారు ప్రభుత్వాన్ని కోరారు

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు బాధితులకు అందజేత

**-పోలీసుల పనితనానికి బాధితుల కృతజ్ఞతలు**




**పాపన్నపేట, జూన్ 4 ( మహాప్రభ )**
సెల్‌ఫోన్లు పోగొట్టుకుని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితులకు పాపన్నపేట ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ గురువారం రికవరీ చేసిన 10 సెల్‌ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటివరకు పోలీస్ స్టేషన్‌లో 544 మంది బాధితులకు సెల్ ఫోన్లు అదజేసినట్లు పేర్కొన్నారు. ప్రత్యేక చర్యలు చేపట్టి సీఈఐఆర్ (CEIR) పోర్టల్ సహాయంతో మొత్తం 553 ట్రెసాబులిటీ చేసి 544 సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్లు .రికవరీ చేసిన చరవాణులను సంబంధిత బాధితులకు దశలవారీగా అప్పగిస్తున్నామని తెలిపారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో లేదా సీఈఐఆర్ ఆన్‌లైన్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. పోగొట్టుకున్న ఫోన్లను గుర్తించి తిరిగి యజమానులకు అప్పగించేందుకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. రికవరీ చేసిన తమ సెల్‌ఫోన్లను తిరిగి పొందిన బాధితులు పోలీసుల సేవలను అభినందిస్తూ, ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్‌తో పాటు పోలీసు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఎలిగేడు సర్పంచ్‌కు ఘన సన్మానం



**ఎలిగేడు,జూన్ 4 (మహాప్రభ)**
ఎలిగేడు గ్రామ సర్పంచ్ కప్పల ప్రవీణ్ను గురువారం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఇండియన్ పబ్లిక్ స్కూల్ ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించి సత్కరించారు.సర్పంచ్ ప్రవీణ్ గతంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచరుగా పనిచేసి అనేకమంది విద్యార్థులను రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దారని ఉపాధ్యాయులు గుర్తుచేశారు. ఆయన కృషి వల్ల పాఠశాల ప్రతిష్ట పెరిగిందని, విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి పెంపొందిందని వారు అభినందించారు.ఈ కార్యక్రమంలో ఇండియన్ పబ్లిక్ స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ సమ్మర్ కోచింగ్ క్యాంప్--2026 ముగింపు







**కార్యక్రమంలో పాల్గొన్న మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు శ్రీ ఈటల రాజేందర్**

**మల్కాజిగిరి జూన్ 4 ( మహప్రభ)**
బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎన్జీవోస్ కాలనీ చత్రపతి శివాజీ గ్రౌండ్స్‌లో మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ కోచింగ్ క్యాంప్--2026 ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు శ్రీ ఈటల రాజేందర్ , వీవీజ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ శ్రీ వికాస్ మహాతో ఐూూ ,డిప్యూటీ కమిషనర్ స్వామి, రంగారెడ్డి అర్బన్ బిజెపి జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి మరియు బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి, హయత్ నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, బిజెపి పార్టీ సీనియర్ నాయకులు కుంట్లూరు వెంకటేష్ గౌడ్ గారు, వీవీజ ఇంజనీరింగ్ విభాగం జుజు నాగేంద్ర , ఐజు కనకయ్య , ాజు విగ్నేశ్వర గారు, స్పోర్ట్స్ ఇన్స్పెక్టర్ విగ్నేష్ గారు హాజరై క్యాంప్‌లో శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ క్రీడలు, వ్యక్తిత్వ వికాసం మరియు వివిధ రంగాల్లో శిక్షణ పొందడం అభినందనీయమని పేర్కొన్నారు. యువత సర్వతోముఖాభివృద్ధికి ఇటువంటి కోచింగ్ క్యాంపులు ఎంతో దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బి.యన్.రెడ్డి డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రావు, వనస్థలిపురం డివిజన్ అధ్యక్షులు క్రాంతి గౌడ్, హయత్ నగర్ డివిజన్ అధ్యక్షులు గంగని శ్రీనివాస్, సీనియర్ నాయకులు నూతి శ్రీనివాస్, ప్రభాకర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శంకరయ్య గౌడ్, రాష్ట్ర బీజేవైఎం కార్యవర్గ సభ్యులు భార్గవ్ తేజ, డివిజన్ ప్రధాన కార్యదర్శి ప్రేమ్నాద్, డివిజన్ బీజేవైఎం అధ్యక్షులు సురేష్ కుమార్, నాయకులు నరేష్ యాదవ్, నాయిని శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్ రావు, మధుసూదన్ రెడ్డి, విజయ్, యోగి, కిషోర్, నాగేష్, సిద్దేశ్వర్ మరియు తదితరులు ఉన్నారు.

# బడి బాట సమర్థవంతంగా నిర్వహించాలి.

**-ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలి.**

**-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**



**మెదక్ జిల్లా -04జూన్ (మహాప్రభ ).**
ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులకు ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ లోని మీటింగ్ హాల్లో విద్యాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. ఈ విద్యా సంవత్సరం మెరుగైన విద్యా ప్రమాణాల లక్ష్యంగా ముందుకు పోతూ బడి బాట సమర్థవంతంగా నిర్వహించాలని,విద్యార్థుల తక్కువ నమోదు పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థుల నమోదు పెంచుటకై గ్రామంలోని ప్రతి ఒక్కరిని భాగస్వాములు చేయాలని, కనీస సామర్థ్యాలు అయినటువంటి చదవడం రాయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పాఠశాలల్లో ఏర్పాటు చేసే మౌలిక వసతుల గురించి తల్లిదండ్రులకు వివరించాలని, వీటి ఆధారంగానే పాఠశాలలకు ప్రగతి సూచికలు ఇవ్వబడతాయని ,రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రీ ప్రైమరీ పాఠశాలలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అలాగే ఎఫ్ఆర్ఎస్, ఇతర అంశాలపై దృష్టి పెట్టి సరియగు చర్యలు గైకొనాలని సూచించారు ,జిల్లాలోని భవిత కేంద్రాల బలోపేతానికి కృషి చేయాలని, కొత్త ప్రీ ప్రైమరీ విభాగాలను ప్రారంభించాలని, విద్యార్థుల సంఖ్యలేని పాఠశాలలను తిరిగి ప్రారంభించాలని, పాఠ్యపుస్తకాల పంపిణీ చేయాలని, స్వయం సహాయక బృందాల చేత పిల్లలకు యూనిఫామ్ కుట్టించాలని, నూతన టెక్నాలజీ ఏఐ, డిజిటల్ తరగతులను నిర్వహించాలని, విద్యాశాఖ బలోపేతానికి ప్రత్యేక కార్యచరణ ప్రకారం ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాజు, చీఫ్ మానిటరింగ్ ఆఫీసర్ రాజు, ఏ ఎం ఓ సుదర్శన మూర్తి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## రామాయంపేట లో ప్రజా పాలన -ప్రగతి ప్రాణాలిక







**రామాయంపేట జూన్ 4 మహా ప్రభ**
రామాయంపేట మున్సిపాలిటీ 3 వార్డు. 4 వార్డ్ 5 వ వార్డులలో గౌరవనీయులైన డాక్టర్. శ్రీ. మైనంపల్లి రోహిత్ రావు గారి ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్పర్సన్ శ్రీమతి గజవాడ లావణ్య నాగరాజు గారి ఆధ్వర్యంలో వార్డు సభ నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్పర్సన్, కౌన్సిలర్లు బ్లాక్ కాంగ్రెస్ నాయకులు. జిల్లా కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు యూత్ నాయకులు పట్టణ ప్రజలు పాల్గొనడం జరిగింది పట్టణ అభివృద్ధి కార్యక్రమాలను మరియు రానున్న వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని తీసుకోవలసిన చర్యల గురించి మరియు నీటిని పొదుపుగా ఉపయోగించుకోవాలని భవిష్యత్ తరాలకు ప్రజలందరూ మార్గదర్శకంగా బాధ్యతగా ఉండాలని మున్సిపల్ చైర్ పర్సన్ గారు చెప్పడం జరిగింది

## సుల్తానాపూర్‌కు ఉత్తమ పర్యావరణ పనితీరు అవార్డు



**ఎలిగేడు, జూన్ 4 (మహాప్రభ)**
పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలంలోని సుల్తానాపూర్ గ్రామపంచాయతీకు ఉత్తమ పర్యావరణ పనితీరు అవార్డు లభించింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం--2026 సందర్భంగా వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణలో పంచాయతీ చేసిన విశిష్ట సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు పంచాయతీ కార్యదర్శి శివ తెలిపారు.ఈ అవార్డును జూన్ 5న శుక్రవారం హైదరాబాద్ సనత్‌నగర్‌లో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి నిర్వహించే కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొండా సురేఖ చేతులమీదుగా సర్పంచ్ కవ్వంపల్లి బాపయ్య, కార్యదర్శి శివ స్వీకరించనున్నారు.

## దేవరకొండ 7వ వార్డులో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక వార్డు సభ నిర్వహణ



**దేవరకొండ డివిజన్ జూన్ 4 ( మహాప్రభ )**
గురువారం దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వార్డు సభ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి 7వ వార్డు కౌన్సిలర్ లిహనుమంతు సాయి చంద్ర గౌడ్‌లి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వార్డు సభలో కౌన్సిలర్ ప్రసంగిస్తూ, పర్యావరణ పరిరక్షణతో పాటు భూగర్భ జలాల పెరుగుదలకు ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. ఇంకుడు గుంతల ద్వారా వర్షపు నీరు భూమిలోకి చేరి భూగర్భ జలమట్టం పెరుగుతుందని, తద్వారా భవిష్యత్తులో నీటి కొరత సమస్యను అధిగమించవచ్చని వివరించారు. అదేవిధంగా, ప్రజలు తమ అవసరాలు మరియు సమస్యలను సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజల భాగస్వామ్యంతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ అధికారి రాకేష్ గారు, వార్డు అధికారి పద్మ ఆర్పీ ధనలక్ష్మి కాంగ్రెస్ పార్టీ నాయకులు యాదయ్య, ఎన్.ఎన్. చారి, బెజవాడ వెంకటయ్య, జ్ఞానేశ్వర్, వెంకటేశ్వర్లు, సుధాకర్ రావు, తిరుపతయ్య, మల్లేష్, శ్రీనివాస్ చారి, అనిల్, మహేష్, వేణు, అజయ్, హరి తేజ వార్డు పెద్దలు, మహిళలు, యువత మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## రాములపల్లిలో స్వచ్ఛతపై అవగాహన



**ఎలిగేడు, జూన్ 4 ( మహాప్రభ )**
ఎలిగేడు మండలంలోని రాములపల్లిలో గురువారం స్వచ్ఛ గావ్--జలవాయు కార్యక్రమంపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో స్వచ్ఛత ర్యాలీ నిర్వహించి ప్రజల్లో పరిశుభ్రతపై చైతన్యం కల్పించారు.గ్రామంలోని కిరాణా షాపులను సందర్శించి, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నాలుగు రకాల చెత్తను వేరు చేసే డస్ట్‌బిన్ల వినియోగంపై వివరించారు. అనంతరం ఎస్ఎల్ఎం షెడ్‌ను సందర్శించి తడి, పొడి చెత్తను వేరు చేసే విధానాన్ని చూపించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిద్ది తిరుపతి యాదవ్, కార్యదర్శి, జీపీవో, ఆశా కార్యకర్తలు, స్వశక్తి సంఘాల మహిళలు, యువకులు పాల్గొన్నారు.

# బస్సులు ఆగాల్సిన చోట కార్లు..
# రోడ్ నెంబర్-1 బస్టాప్ దుస్థితి





**కూకట్పల్లి, జూన్ 4 (మహాప్రభ)**
నగర ప్రజల కోసం ఏర్పాటు చేసిన బస్టాప్‌లు ప్రస్తుతం తమ అసలు ప్రయోజనాన్ని కోల్పోతున్నాయి. ప్రజా రవాణాను సులభతరం చేయడానికి, ప్రయాణికులు సురక్షితంగా బస్సులు ఎక్కి దిగేందుకు నిర్మించిన బస్ బేలు కొన్నిచోట్ల అక్రమ పార్కింగ్ కేంద్రాలుగా మారుతున్నాయి. అలాంటి పరిస్థితి కూకట్‌పల్లి రోడ్ నెంబర్-1 బస్టాప్ వద్ద కనిపిస్తోంది. బస్సులు ఆగాల్సిన బస్ బేలో కార్లు, ఇతర వాహనాలు పార్క్ చేయడంతో బస్సులు నిర్దేశిత స్థలంలో ఆగలేకపోతున్నాయి. దీంతో బస్సులు ప్రధాన రోడ్డుపైనే ఆగాల్సి వస్తోంది. ఫలితంగా ప్రయాణికులు ట్రాఫిక్ మధ్యలో బస్సులు ఎక్కి దిగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది ప్రమాదాలకు దారితీసే అవకాశాలను పెంచుతోంది. ప్రత్యేకించి విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు. బస్సులు బస్ బేలోకి ప్రవేశించలేకపోవడంతో ట్రాఫిక్‌కు కూడా అంతరాయం కలుగుతోంది. ప్రజల సౌకర్యం కోసం నిర్మించిన బస్టాప్‌లు వ్యక్తిగత వాహనాల పార్కింగ్ స్థలాలుగా మారడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల అభిప్రాయం ప్రకారం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి బస్ బేల్లో అక్రమ పార్కింగ్‌ను అరికట్టాలి. నిఘా పెంచడంతో పాటు, నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. "ప్రజా రవాణా కోసం నిర్మించిన బస్టాప్‌లు ప్రజలకే ఉపయోగపడాలి. బస్సులు ఆగే ప్రదేశాలను పార్కింగ్ స్థలాలుగా మార్చడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలి" అని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## చిలకూరి రామ్ రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి



**గడ్డి అన్నారం 4 జూన్ (మహాప్రభ )**
సరూర్‌నగర్ కట్ట భవాని శంకర్ ఆలయం, పోచమ్మ ఆలయాల చైర్మన్ మరియు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చిలకూరి రామ్ రెడ్డి జన్మదిన సందర్భంగా బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి వారిని సరూర్‌నగర్‌లోని భవాని శంకర్ దేవాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, చిలకూరి రామ్ రెడ్డి సామాన్య కార్యకర్తగా పార్టీకి సేవలు ప్రారంభించి, తన కృషి, అంకితభావం, నిబద్ధతతో నేడు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఎదిగి పార్టీ బలోపేతానికి విశేష సేవలు అందిస్తున్నారని కొనియాడారు. పార్టీ అభివృద్ధి కోసం ఆయన చేస్తున్న కృషి ఆదర్శనీయమని పేర్కొన్నారు. అలాగే భవిష్యత్తులో చిలకూరి రామ్ రెడ్డి మరెన్నో ఉన్నత పదవులను అలంకరించి, సంపూర్ణ ఆయురారోగ్యాలతో ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం డివిజన్ అధ్యక్షులు దాసరి జయప్రకాశ్, సీనియర్ నాయకులు శ్రవణ్, అశోక్, అశోక్ గౌడ్, రాజు, శివరామ్, సతీష్, రత్నం, చిలకూరి మధుసూదన్ రెడ్డి, సిద్దు, శశాంక్, టీంకు, రాము తదితరులు పాల్గొన్నారు.

# కైతలాపూర్‌లో అక్రమ బహుళ
# అంతస్తుల నిర్మాణాలపై అధికారుల మౌనం








**ప్రజలకు డ్రైనేజీ, నీటి, రోడ్ల సమస్యలతో నరకయాతన!**


**కూకట్పల్లి, జూన్ 4 (మహ ప్రభ)**
హైదరాబాద్‌లోని కైతలాపూర్ ప్రాంతంలో అనుమతులు లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనాలపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజురోజుకూ భారీ నిర్మాణాలు వెలుస్తున్నప్పటికీ, వాటికి తగిన డ్రైనేజీ, తాగునీటి సరఫరా, రోడ్ల విస్తరణ వంటి మౌలిక సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపిస్తున్నారు.
స్థానికుల కథనం ప్రకారం, కొన్ని భవనాలు అనుమతులకు మించి అంతస్తులు నిర్మిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించడం లేదని, ఫిర్యాదులు చేసినా స్పందన కనిపించడం లేదని చెబుతున్నారు. భారీ భవనాల నిర్మాణంతో ఇప్పటికే ఇరుకైన వీధులు మరింత రద్దీగా మారి, వర్షాకాలంలో డ్రైనేజీ వ్యవస్థ స్తంభించి కాలనీలు మురుగునీటితో నిండిపోతున్నాయని వాపోతున్నారు. ప్రాంతంలో తాగునీటి సమస్య కూడా రోజురోజుకూ పెరుగుతోందని, కొత్తగా నిర్మితమవుతున్న అపార్ట్‌మెంట్ల సంఖ్య పెరుగుతున్నా నీటి వనరుల అభివృద్ధి జరగడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లు దెబ్బతిని ప్రయాణికులు, వృద్ధులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు.
ప్రజలు ప్రశ్నిస్తున్న అంశం ఒక్కటే -- అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయంటే సంబంధిత శాఖల అధికారులు ఎక్కడ ఉన్నారు? అనుమతులు లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు కొనసాగుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.
స్థానికులు వెంటనే సమగ్ర సర్వే నిర్వహించి, అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు డ్రైనేజీ, తాగునీరు, రోడ్ల సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

# జనగణనను పకడ్బందీగా నిర్వహించాలి
**-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



**మెదక్ జిల్లా -04జూన్ (మహాప్రభ)**
జనగణన కార్యక్రమాన్ని అధికారులు, సిబ్బంది సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జనగణన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. జనగణన దేశ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు, సంక్షేమ పథకాల అమలుకు అత్యంత కీలకమైన ప్రక్రియ అని తెలిపారు. ప్రతి ఇంటిని సందర్శించి, ప్రజల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జనగణన నిర్వహించాలన్నారు. జనగణన సిబ్బందికి అవసరమైన శిక్షణ, సామగ్రి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు కూడా జనగణన సిబ్బందికి సహకరించి సరైన సమాచారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. జనగణన విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, జనగణన సిబ్బంది పాల్గొన్నారు.

## ఈ రోజు అక్కన్నపేట నగర్ వన్ యోజన పార్కులో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు..



**మెదక్ జిల్లా -04జూన్ (మహాప్రభ )**
అటవీ శాఖ ఆధ్వర్యంలో 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' కార్యాచరణకు ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకానున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' లో భాగంగా మెదక్ జిల్లాలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు.
అటవీ శాఖ ఆధ్వర్యంలో జూన్ 1 నుండి జూన్ 12 వరకు ప్రత్యేక పర్యావరణ ఇతివృత్త కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. ఇందులో భాగంగా జూన్ 5 ఈ రోజు ఉదయం 9:30 గంటలకు మెదక్ జిల్లాలోని అక్కన్నపేట నగర్ వన్ యోజన పార్క్ వేదికగా ఈ ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు జరగనున్నాయి. ఈ పర్యావరణ మహోత్సవానికి జిల్లాలోని ప్రముఖ ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. పర్యావరణ పరిరక్షణ, అడవుల విస్తరణ, మరియు ప్రకృతి సమతుల్యతను కాపాడటంపై ఈ సందర్భంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు మరియు మొక్కలు నాటే కార్యక్రమాలను చేపట్టనున్నారనీ,మెదక్ జిల్లా అటవీ శాఖ అధికారి జోజి గురువారం ఒక ప్రకటనలో కోరారు.

# శ్రీశైలంలో దత్తాత్రేయ స్వామివారికి విశేషపూజలు



**శ్రీశైలం, జూన్ 4 (మహాప్రభ)**
లోకకల్యాణం కోసం శ్రీశైలం దేవస్థానంలో గురువారం దత్తాత్రేయస్వామివారికి విశేషపూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద నెలకొని ఉన్న దత్తాత్రేయస్వామివారికి ప్రతి గురువారం సర్కారీ సేవగా ఈ కైంకర్యం జరుగుతుందని దేవస్థానం అధికారులు తెలిపారు. కార్యక్రమం నిర్విఘ్నంగా సాగేందుకు ముందుగా మహాగణపతిపూజ జరిపి, అనంతరం పంచామృతాభిషేకం, విశేషపూజలు నిర్వహించారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఒకే స్వరూపముగా అవతరించిన త్రిమూర్తి స్వరూపుడైన దత్తాత్రేయుని ఆరాధనకు భక్తులు విశేషంగా హాజరయ్యారు.
శ్రీశైలక్షేత్రానికి దత్తాత్రేయుల సంబంధం ఎంతో ప్రత్యేకమని పురాణాలు చెబుతున్నాయి. త్రిఫలవృక్షం క్రింద దత్తాత్రేయులు తపస్సు చేసినట్లు ప్రతీతి. కలియుగంలో గోదావరి తీరం పిఠాపురంలో శ్రీపాదవల్లభునిగా, అనంతరం మహారాష్ట్రలో నృసింహసరస్వతిగా అవతరించి శ్రీశైలంలో చాతుర్మాస్య వ్రతం ఆచరించినట్లు గురుచరిత్ర పేర్కొంటుంది.
నృసింహసరస్వతి స్వామి శ్రీశైలంలోని పాతాళగంగలో అవతార సమాప్తి చేసి, అదృశ్య రూపంలో భక్తులను రక్షించేందుకు నిర్ణయించుకున్నారని గ్రంథాలు చెబుతున్నాయి.

# షికారిపేటలో బెల్లం ఊట ధ్వంసం
**నాటు సారాయి స్వాధీనం, ఇద్దరు అరెస్టు**



**నందికొట్కూరు, జూన్ 4 (మహాప్రభ)**
నంద్యాల జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి ఎస్. రవికుమార్ ఆదేశాల మేరకు నంద్యాల స్క్వాడ్, నందికొట్కూరు ఎస్సై సిబ్బందితో కలిసి షికారిపేట కాలనీలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 100 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 15 లీటర్ల నాటు సారాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా షికారి హైమ, షికారి లక్ష్మిలను అరెస్టు చేశారు. దాడుల్లో ఎస్సై రమేష్, ఎస్సై జఫరుల్లా, హెడ్ కానిస్టేబుల్ పద్మనాభం, శంకర్ నాయక్, కానిస్టేబుల్ సుధీర్ కుమార్, శివన్న, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీ కార్యకర్త పై ఫిర్యాదు




**దేవరకొండ జూన్ 4 (మహాప్రభ)**
ఈ నెల 2వ తారీఖున తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన దేవరకొండ మండలం, కొర్రతండా గ్రామ పంచాయతీకి చెందిన జనసేన పార్టీకి చెందిన కార్యకర్త కొర్ర చందుపై దేవరకొండ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ అట్టి వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దేవరకొండ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ కి పిర్యాదు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొర్ర రాంసింగ్ నాయక్, ఆంజనేయులు,హారిష్ , రాజు యూత్ కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

## బిజినెస్

# పౌల్ట్రీకి దాణా ఖర్చు సెగ..

**- 25% వరకు తగ్గించుకున్న ఉత్పత్తి**



**న్యూఢిల్లీ, జూన్ 4**

దేశీయ పౌల్ట్రీ రంగానికి దాణా ఖర్చుల సెగ గట్టిగానే తాకింది. ఈ దెబ్బకు పౌల్ట్రీ సంస్థలు ఉత్పత్తిని 25 శాతం వరకు తగ్గించుకునే యోచనలో ఉన్నాయని ఆల్ ఇండియా పౌల్ట్రీ బ్రీడర్స్ అసోసియేషన్(ఏఐపీబీఏ) తాజాగా వెల్లడించింది. వీటికి తోడు జూలై నుంచి అక్టోబర్ మధ్యకాలంలో పండుగ సీజన్ కావడంతో చికెన్‌కు డిమాండ్ పడిపోనుండటం కూడా ఉత్పత్తి కోత పెట్టడానికి ప్రధాన కారణాలని ఏఐపీబీఏ చైర్మన్ బహదూర్ అలీ తెలిపారు.అలాగే సోయాబీన్ మీల్ ధరలు గడిచిన కొన్ని నెలల్లో 40 శాతం వరకు పెరుగడంతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న పౌల్ట్రీపై దాణా పిడుగు పడినట్టు అయిందన్నారు. ఉత్పత్తి వ్యయం పెరిగి ఇబ్బందులు ఎదుర్కొంటున్న పౌల్ట్రీ సంస్థలపై జూలై నుంచి అక్టోబర్ వరకు నవరాత్రి, శ్రావణ, కార్తిక మాసం ఉండటంతో కొనుగోళ్లు పడిపోనున్నాయన్నారు.

# నేడు ఆర్బీఐ పరపతి సమీక్ష

**ముంబై,**

రిజర్వుబ్యాంక్ తన ద్రవ్య పరపతి సమీక్షను శుక్రవారం ప్రకటించనున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను రెండో ద్వైమాసిక పరపతి సమీక్షలో కీలక వడ్డీరేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలు మెండుగావున్నాయని, లేకపోతే వడ్డీరేట్లను పావు శాతం పెంచే అవకాశం ఉన్నదని పలువురు ఆర్థికవేత్తలు అంచనావేస్తున్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా చమురు ధరలు భగ్గుమనడంతో ధరల సూచీ ఆకాశమే హద్దుగా దూసుకుపోయే అవకాశాలుండటం ఈసారి సమీక్షలో రిజర్వుబ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నిర్ణయం కీలకంగా మారింది. ఆరుగురు సభ్యులు కలిగిన




పరపతి సమీక్ష సమావేశం బుధవారం ప్రారంభమై శుక్రవారం తన నిర్ణయాన్ని ప్రకటించనున్నది. ఈ సమీక్షపై పీటీఐ నిర్వహించిన పోల్‌లో పలువురు ఆర్థిక వేత్తలు తమ నిర్ణయాన్ని ప్రకటించారు. వీరిలో 11 మంది వడ్డీరేట్ల యథాతథ స్థితికి ఓటు వేయగా, నలుగురు మాత్రం పావు శాతం పెంచే అవకాశం ఉన్నదని తమ అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. ద్రవ్యోల్బణ రిస్క్ కారణంగా ఈ ఏడాది సెంట్రల్ బ్యాంక్ వడ్డీరేట్లను రెండు సార్లు సవరించే అవకాశాలున్నాయని అత్యధిక మంది అభిప్రాయపడ్డారు. ఎస్బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి మాట్లాడుతూ..దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ఉండటంతో ఆర్బీఐ కూడా ఈసారి వడ్డీరేట్లను స్థిరంగా ఉంచే అవకాశాలున్నాయన్నారు.

# మారుతి తొలి ఇథనాల్ కారు..

**-వ్యాగన్‌ఆర్ మాడల్‌ను ఆవిష్కరించిన సంస్థ**

**న్యూఢిల్లీ,**

కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ..తన తొలి ఇథనాల్ కారును అందుబాటులోకి తీసుకొచ్చింది. తొలి ఫ్లెక్స్ ఫ్యూయల్ కారైన వ్యాగన్‌ఆర్ మాడల్‌ను పరిచయం చేసింది. ఇథనాల్–బ్లెండెడ్ ఫ్యూయల్‌తో నడిచే ఈ కారుతో సాధారణ పెట్రోల్ కార్లతో పోలిస్తే ఈ నయా వ్యాగన్‌ఆర్ మాడల్ 85 శాతం ఇథనాల్, 15 శాతం పెట్రోల్‌తో నడువనున్నదని మారుతి సుజుకీ ఇండియా ఎండీ, సీఈవో హిసాషి తకేచి తెలిపారు.. ఈ కారు ధర ప్రస్తుతం సంస్థ వెల్లడించకపోయినప్పటికీ, రూ.8 లక్షలకు పైగా ఉంటుందని అంచనా.2024లో న్యూఢిల్లీలో జరిగిన భారత్ మొబిలిటీ ఎక్స్‌పోలో ఈ కారును ప్రదర్శించిన మారుతి..రెండేండ్ల తర్వాత మార్కెట్లోకి విడుదల చేయడానికి సిద్ధమైంది. సీఎన్‌జీ, ఎల్‌పీజీ వాహనాలకు ప్రత్యామ్నాయంగా సంస్థ ఈ మాడల్‌ను తీసుకొచ్చినట్టు చెప్పారు. తద్వారా చమురు వాడకం తగ్గడంతోపాటు విలువైన విదేశీ మారకం చెల్లింపులు తగ్గే అవకాశం ఉండటం, కాలుష్యం మరింత తగ్గనున్నదన్నారు. ఈ కారును కేంద్ర




మంత్రులు నితిన్ గడ్కరీ, హర్దీప్ సింగ్ పూరి ఆవిష్కరించారు.

**ఇథనాల్ పంపుల కొరత**


చమురు దిగుమతులను నియంత్రించడానికి కేంద్ర ప్రభుత్వం ఒకవైపు కఠిన చర్యలు తీసుకుంటున్నప్పటికీ మరోవైపు, ప్రత్యామ్నాయాలపై పెద్దగా దృష్టి సారించడం లేదు. ఈవీల వాడకాన్ని పెంపొందించడానికి తీసుకుంటున్న చర్యలు..వీటి కోసం చార్జింగ్ పాయింట్ల ఏర్పాటును పెద్దగా ప్రోత్సహించడం లేదు. దీంట్లోభాగంగా ప్రస్తుతం విడుదలైన ఇథనాల్ కారు ఇంధన సరఫరాతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని తెలుస్తున్నది. నూఢిల్లీ సర్కిల్‌లో ప్రస్తుతం 50 నుంచి 100 ప్రాంతాల్లో మాత్రమే ఇథనాల్ అవుట్‌లెట్లు మాత్రమే ఉన్నాయని, వీటిని పెంచాలనే డిమాండ్ నెలకొన్నది.

## స్పోర్ట్స్

# నెంబర్ వన్ చేతిలో మళ్లీ ఓడిన పీవీ సింధు.. ఇండోనేషియా ఓపెన్ నుంచి ఔట్

జకార్తా

ఒలింపిక్ మెడలిస్ట్ పీవీ సింధు ఇండోనేషియన్ ఓపెన్‌లో ఇవాళ ఓటమి పాలైంది. వరల్డ్ నెంబర్ వన్ ప్లేయర్ ఆన్ సే యంగ్ చేతిలో ఆమ పరాజయాన్ని చూవిచూసింది. 17–21, 14–21 స్కోరుతో దక్షిణ కొరియా క్రీడాకారిణి విజయాన్ని నమోదు చేసింది. అయితే ఇటీవల వరుసగా రెండోసారి ఆన్ సే యంగ్ చేతిలో పీవీ సింధు ఓడింది. గత వారం సింగపూర్ ఓపెన్ క్వార్టర్స్‌లోనూ సింధు ఓటమి పాలైన విషయం తెలిసిందే. అయితే ఇప్పటి వరకు ఆన్ సే యంగ్, సింధు మధ్య 10 మ్యాచ్‌లు జరిగాయి. అన్నింటిలోనూ సింధు ఓడింది. ఇప్పటి వరకు ఆన్‌పై సింధు విక్టరీ నమోదు చేయకపోవడం గమనార్హం. జరిగిన రౌండ్–16 మ్యాచ్‌లో తొలి గేమ్ ఆసక్తికరంగా సాగింది. ఓ దశలో ఇద్దరూ 10–10 స్కోరుతో సమంగా నిలిచారు. కొరియన్ ప్లేయర్‌ను కాసేపు వత్తిడిలో పెట్టింది సింధు. ఆ తర్వాత 15–14 లీడ్ సాధించింది. కానీ ఆన్




దూకుడు ఆటతో సింధు వెనుకబడింది. తొలి గేమ్ చివరలో 41 షాట్ల ర్యాలీ ఆడారు. ఆ తర్వాత ఓపెనింగ్ గేమ్‌ను కొరియన్ క్రీడాకారిణి సొంతం చేసుకున్నది. రెండో గేమ్‌లోనూ ఆన్ ఈజీగా విజయాన్ని నమోదు చేసింది.

# అంతర్జాతీయ క్రికెట్‌కు శ్రీకర్ భరత్ గుడ్‌బై

**32 ఏండ్లకే రిటైర్మెంట్ ఇచ్చిన ఏపీ కికెటర్**

న్యూఢిల్లీ

భారత వికెట్ కీపర్ బ్యాటర్, ఏపీ క్రికెటర్ కోన శ్రీకర్ భరత్ 32 ఏండ్ల వయసులోనే అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. అన్ని ఫార్మాట నుంచి తప్పుకుంటున్నట్లు గురువారం సోషల్ మీడియా పోస్టు ద్వారా వెల్లడించాడు. రిషబ్ పంత్ అందుబాటులో లేని సమయంలో కేఎస్ భరత్ టెస్టు జట్టులోకి వచ్చాడు. 2023లో ఆస్ట్రేలియాతో జరిగిన బోర్డర్–గవాస్కర్ ట్రోఫీతో అరంగేట్రం చేశాడు. తన కెరీర్‌లో ఏడు టెస్టులు మ్యాచ్‌లు ఆడిన భరత్.. బ్యాటింగ్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు.కేవలం 221 పరుగులు మాత్రమే సాధించాడు. దేశవాళీ క్రికెట్‌లో ఆంధ్ర జట్టు తరఫున సుదీర్ఘ కాలం పాటు స్థిరమైన ప్రదర్శన ఇచ్చిన భరత్.. 113 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 6102 రన్స్ చేశాడు. ఐపీఎల్‌లో పది మ్యాచ్‌లు ఆడాడు. దేశం తరఫున ఆడటం తన జీవితంలో దక్కిన అత్యంత గొప్ప గౌరవంగా భావిస్తున్నానని పేర్కొన్న భరత్ ఈ ప్రయాణంలో



తనకు అండగా నిలిచిన బీసీసీఐ, ఆంధ్ర క్రికెట్ సంఘం, తన కెప్టెన్లు కోహ్లీ, రోహిత్, కోచ్ రాహుల్ ద్రవిడ్‌కు ధన్యవాదాలు తెలిపాడు.

# ఆఫ్ఘనిస్తాన్‌తో వన్డే సిరీస్‌కు విరాట్ కోహ్లీ దూరం




**ముంబై**

ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న వన్డే సిరీస్‌కు విరాట్ కోహ్లీ దూరం కానున్నాడు. అతను తొడకండరాల నొప్పితో బాధపడుతున్నట్లు తెలిసింది. ఇటీవల ముగిసిన ఐపీఎల్ టోర్నీలో.. ఆర్సీబీ బ్యాటర్ విరాట్ కోహ్లీ అద్భుత ప్రదర్శన ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే జూన్ 13వ తేదీ నుంచి ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న వన్డే సిరీస్‌కు కోహ్లీని ఎంపిక చేయడం లేదని తెలిసింది. తొడకండరాల నొప్పి వల్ల అతను వన్డే సిరీస్ ఆడకపోవచ్చు అని బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు.37 ఏళ్ల కోహ్లీ.. ఈ యేటి ఐపీఎల్‌లో 675 రన్స్ చేసి తన ఫిట్‌నెస్ చాటుకున్నాడు. ఈ సీజన్‌లో అతను ఓ సెంచరీ, అయిదు హాఫ్ సెంచరీలు కొట్టాడు. అయితే ఆఫ్ఘన్‌తో సిరీస్‌కు అతను అందుబాటులో లేకపోవడం భారత జట్టుకు లోటే అవుతుంది. ఫిట్‌నెస్‌లో అత్యున్నత ప్రమాణాలు పాటిస్తున్న అతను వన్డే సిరీస్ మిస్ కావడం చాలా అరుదైన అంశం. అయితే రోహిత్ శర్మ ఈ సిరీస్‌కు అందుబాటులో ఉంటాడో లేదో ఇంకా తెలియదు. ఐపీఎల్‌లో రోహిత్‌కు కూడా తొడకండరాలు పట్టేసిన విషయం తెలిసిందే. అయినా అతన్ని భారత జట్టుకు తీసుకున్నారు.టెస్టు క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకున్న కోహ్లీ, రోహిత్‌లు.. వన్డేలపై దృష్టి పెట్టారు. అయితే వచ్చే ఏడాది నవంబర్‌లో దక్షిణాఫ్రికాలో జరగనున్న వన్డే వరల్డ్‌కప్‌లో ఆ ఇద్దరూ ఆడుతారేమో అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇక ఆఫ్ఘనిస్తాన్‌తో లక్నోలో 17న రెండో వన్డే, చెన్నైలో 20న మూడో వన్డే జరగనున్నది.

# ఓటీటీలోకి నందు 'అగ్లీ స్టోరీ'..

## – స్ట్రీమింగ్ ఎప్పుడంటే!




టాలీవుడ్ నటుడు శ్రీ నందు మరియు అవికా గోర్ ప్రధాన పాత్రల్లో నటించిన లవ్ అండ్ సైకలాజికల్ థ్రిల్లర్ మూవీ 'అగ్లీ స్టోరీ' ఓటీటీ విడుదలకు సిద్ధమైంది. ఈ చిత్రం జూన్ 05 నుంచి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫారమ్ 'ఆహా' లో తెలుగుతో పాటు తమిళ భాషలోనూ డిజిటల్ స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి రానుంది.ప్రణవ్ స్వరూప్ దర్శకత్వంలో, రియా జియా ప్రొడక్షన్స్ పతాకంపై తెరకెక్కిన ఈ చిత్రంలో రవితేజ మహాదాస్యం, శివాజీ రాజా కీలక పాత్రలు పోషించగా, శ్రవణ్ భరద్వాజ్ సంగీతాన్ని అందించారు. ఒక అమ్మాయిని ప్రాణంగా ప్రేమించిన వ్యక్తి, ఆమె మరొకరిని ప్రేమిస్తోందనే నిజాన్ని తట్టుకోలేక సైకోగా ఎలా మారాడు, ఆ తిరస్కరణ ఎలాంటి ప్రమాదకరమైన పరిస్థితులకు దారితీసింది అనే ఆసక్తికరమైన డార్క్ రొమాంటిక్ థ్రిల్లర్ కథాంశంతో ఈ సినిమా రూపొందింది. థియేటర్లలో ఈ విభిన్నమైన థ్రిల్లర్‌ను మిస్ అయిన ప్రేక్షకులు ఈ రాత్రి నుండి 'ఆహా' వేదికగా వీక్షించవచ్చు.

# సోషల్ మీడియాలో 'పెద్ది' మేనియా

## 'బుక్ మై షో'లో గంటకు 40వేల టికెట్స్ బుక్



ప్రస్తుతం సోషల్ మీడియాలో 'పెద్ది' మేనియా కనిపిస్తోంది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా వాటిని అందుకొని హిట్ టాక్‌ను సొంతం చేసుకుంది. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా గురువారం ప్రేక్షకుల ముందుకువచ్చిన విషయం తెలిసిందే. రిలీజ్‌కు ముందు నుంచే టికెట్ బుకింగ్స్‌లో జోరు చూపిన చిత్రం విడుదల అనంతరం కూడా అదే కొనసాగిస్తోంది. ప్రముఖ టికెట్ బుకింగ్ యాప్ 'బుక్ మై షో'లో 'పెద్ది'కు గంటకు 40వేల టికెట్స్ బుక్ అవుతున్నాయి. 2023లో బుక్‌మై షో ప్రవేశపెట్టిన 'అవర్లీ ట్రెండింగ్' ఫీచర్ తర్వాత.. ఈ 40 వేల మార్క్‌ను దాటిన చిత్రాల జాబితాలో ఇప్పటివరకు మూడు సినిమాలు మాత్రమే ఉన్నాయి. కల్కి 2898 ఏడీ, సలార్, పుష్ప తర్వాత స్థానంలో 'పెద్ది' నిలిచింది. మొదటిరోజే ఈ మార్క్‌ను చేరుకొని రికార్డు సృష్టించింది. కర్ణాటకలో జరిగిన ప్రీమియర్ షోల ద్వారా 'పెద్ది' భారీ వసూళ్లను సాధించి, టాలీవుడ్‌లోని పలు అగ్రహీరోల చిత్రాల రికార్డులను తిరగరాసింది. ప్రీమియర్స్‌లో రూ. 3.2 కోట్లు వసూలు చేసినట్లు సినీ వర్గాలు తెలిపాయి. దీంతో అక్కడ ప్రీమియర్ కలెక్షన్స్ సాధించిన మొదటి తెలుగు సినిమాగా నిలిచింది. గతంలో విడుదలైన 'ఓజీ' (రూ. 2.72 కోట్లు), 'రాజా సాబ్' (రూ. 2.61 కోట్లు), పుష్ప 2 (రూ. 2.55 కోట్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. రామ్‌చరణ్‌కు జోడీగా జాన్వీకపూర్ నటించిన ఈ సినిమాలో పాటలు కూడా సూపర్ హిట్‌గా నిలిచాయి. ముఖ్యంగా 'చికిరి చికిరి' పాట విడుదలైన రెండు వారాలకే 10 కోట్లకు పైగా వ్యూస్‌తో ట్రెండింగ్‌లో నిలిచింది. అయితే, ఈ పాట లిరిక్స్‌లో 'సరుకూ సామాన్లు' అనే పదంపై కొందరు అభ్యంతరం వ్యక్తం చేయడంతో టీమ్ ఈ పదాన్ని మార్చినట్లు తెలుస్తోంది. థియేటర్‌లలో దీనికి బదులుగా 'సొగసు సింగారం' అని చేర్చారని నెటిజన్లు పోస్ట్‌లు పెడుతున్నారు. ఈ స్పోర్ట్స్ డ్రామాకు ఏఆర్ రెహమాన్ సంగీతం హైలైట్‌గా నిలిచింది



# ఆ హీరో నా ఫస్ట్ క్రష్.. ఎప్పటికైన అతడితో డేట్ కు వెళ్తాను..

## -హీరోయిన్ మీనాక్షి చౌదరి..

టాలీవుడ్‌లో ప్రస్తుతం మోస్ట్ వాంటెడ్ హీరోయిన్లలో ఒకరిగా దూసుకుపోతోంది పంజాబీ ముద్దుగుమ్మ మీనాక్షి చౌదరి. 'హిట్ 2', 'గుంటూరు కారం', 'లక్కీ భాస్కర్' వంటి చిత్రాలతో వరుస విజయాలను అందుకుంటూ ఇండస్ట్రీలో 'లక్కీ ఛామ్'గా మారిపోయింది. కేవలం టాలీవుడ్‌లోనే కాకుండా కోలీవుడ్‌లోనూ (తమిళ పరిశ్రమ) విజయ్ దళపతి సరసన నటించి అక్కడి ప్రేక్షకుల మనసులను గెలుచుకుంది. ఈ క్రమంలోనే కోలీవుడ్ స్టార్ హీరో శింబు గురించి మీనాక్షి చౌదరి చేసిన కొన్ని క్రేజీ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో మీనాక్షి చౌదరికి ఒక ఆసక్తికరమైన ప్రశ్న ఎదురైంది."ఒకవేళ మీరు సినీ పరిశ్రమకు చెందిన ఏ హీరోతోనైనా 'మూవీ డేట్' (సినిమాకు వెళ్లడం) కి వెళ్లాల్సి వస్తే.. ఎవరిని ఎంచుకుంటారు?" అని యాంకర్ అడిగారు. దీనికి మీనాక్షి ఏమాత్రం తడుముకోకుండా, ఎంతో ఉత్సాహంగా కోలీవుడ్ స్టార్ హీరో శింబు పేరును చెప్పింది. "నేను మూవీ డేట్‌కు వెళ్లాలనుకుంటే ఖచ్చితంగా శింబు సార్‌తోనే వెళ్తాను" అంటూ చాలా ఎగ్జైటింగ్‌గా సమాధానం ఇచ్చింది. శింబు స్క్రీన్ ప్రెజెన్స్, ఆయన నటన అంటే తనకు చాలా ఇష్టమని ఈ బ్యూటీ పేర్కొంది. శింబుపై మీనాక్షి చేసిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.ముఖ్యంగా శింబు అభిమానులు ఈ వ్యాఖ్యలపై హర్షం వ్యక్తం చేస్తూ, ఈ ఇద్దరి కాంబినేషన్‌లో ఒక సినిమా వస్తే చూడాలని ఉందంటూ కామెంట్లు పెడుతున్నారు. కాగా, ప్రస్తుతం కోలీవుడ్ సర్కిల్స్‌లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం... దర్శకుడు అశ్వత్ మరిముత్తు నేతృత్వంలో శింబు నటిస్తున్న భారీ ప్రాజెక్ట్ 'ఇు= 49' లో మీనాక్షి చౌదరి కథానాయికగా నటించే గోల్డెన్ ఛాన్స్ కొట్టేసినట్లు టాక్ నడుస్తోంది. ఈ సినిమా గురించిన చర్చల నేపథ్యంలోనే ఆమె శింబుపై ఇలాంటి క్రేజీ కామెంట్స్ చేయడం విశేషం. వరుస సక్సెస్‌లతో జోరు మీదున్న మీనాక్షి, ఒక పక్క తెలుగులో నాగచైతన్యతో 'వృషకర్మ' వంటి చిత్రాల్లో నటిస్తూనే, మరోపక్క తమిళంలోనూ క్రేజీ ఆఫర్లను సొంతం చేసుకుంటూ బిజీగా గడుపుతోంది.కెరీర్ పరంగా ఇంత సక్సెస్‌ఫుల్‌గా సాగుతున్న ఈ డాక్టరమ్మ, భవిష్యత్తులో శింబుతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకుంటే బాక్సాఫీస్ వద్ద మరిన్ని సంచలనాలు సృష్టించడం ఖాయమని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. శ్రీలీల, భాగ్యశ్రీ బోర్సే లాంటి తోటి హీరోయిన్లు ఫ్లాపుల్లో ఉన్న తరుణంలో మీనాక్షి చౌదరి ఇలా వరుస అప్‌డేట్స్‌తో ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా నిలుస్తోంది.హర్యానాకు చెందిన మీనాక్షి చౌదరి చదువులో చాలా యాక్టివ్. ఆమె ఒక డెంటిస్ట్ (బీడీఎస్ - బ్యాచిలర్ ఆఫ్ డెంటల్ సర్జరీ). చదువు పూర్తి చేసిన తర్వాత మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టిన ఆమె, 2018లో జరిగిన ప్రతిష్ఠాత్మక 'ఫెమినా మిస్ ఇండియా' పోటీల్లో రన్నరప్‌గా నిలిచారు. ఆ తర్వాత 'మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్ 2018' పోటీల్లో భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించి ఫస్ట్ రన్నరప్ కిరీటాన్ని గెలుచుకున్నారు. 2021లో సుశాంత్ హీరోగా వచ్చిన 'ఇచ్చట వాహనములు నిలుపరాదు' సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమయ్యారు


# రవితేజ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్..

## రాబోతున్న 'ఇరుముడి' పవర్‌ఫుల్ థీమ్ సాంగ్!



మాస్ మహారాజా రవితేజ, డైరెక్టర్ శివ నిర్వాణ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న మోస్ట్ అవేటెడ్ ప్రాజెక్ట్ 'ఇరుముడి' నుంచి అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఒక సాలిడ్ అప్‌డేట్ వచ్చేసింది. ఇప్పటికే ఈ మూవీ నుంచి గ్లింప్స్‌ను విడుదల చేయగా.. ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటుంది. అయితే తాజాగా ఈ సినిమా నుంచి ఒక ప్రత్యేకమైన సాంగ్ అప్‌డేట్‌ను మేకర్స్ సోషల్ మీడియా వేదికగా అధికారికంగా పంచుకున్నారు. గత కొన్ని రోజులుగా అభిమానుల నుంచి వస్తున్న భారీ రిక్వెస్ట్‌లను పరిగణనలోకి తీసుకుని, ఈ సినిమాకు సంబంధించిన పవర్‌ఫుల్ 'ఇరుముడి' థీమ్ సాంగ్‌ను త్వరలోనే విడుదల చేయబోతున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ పాట 'విల్లాది వీరుడు వీర మణికంఠుడు' అనే పవర్‌ఫుల్ అయ్యప్ప స్వామి భక్తి గీతంగా ఉండబోతోందని తెలుస్తుంది.ఇటీవల విడుదలైన ఈ సినిమా గ్లింప్స్ (ఒష్ట్రవ ఎముఖీ శీట ×తీబఎబఎఱ) ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోగా, ఇందులో రవితేజ ఒక ఎమోషనల్ తండ్రి పాత్రలో సరికొత్త లుక్‌లో కనిపించబోతున్నారు. కూతురి కోసం ఒక తండ్రి పడే తపన, మద్యపానానికి దూరమై అయ్యప్ప దీక్ష స్వీకరించి ఆధ్యాత్మిక మార్గంలో సాగే ఒక ఎమోషనల్ అండ్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా కథాంశం ఉండబోతోంది. ఈ చిత్రంలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ నటిస్తుండగా, బేబీ నక్షత్ర రవితేజ కూతురిగా కీలక పాత్ర పోషిస్తోంది. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ జి.వి. ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ భారీ చిత్రం ఆగస్టు 2026లో థియేటర్లలోకి రానుంది.

# ప్రశాంత్ నీల్‌కు ఎన్టీఆర్ బర్త్‌డే విషెస్




ఇండియన్ స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ పుట్టినరోజు సందర్భంగా అగ్ర కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ సోషల్ మీడియా వేదికగా ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ప్రశాంత్ నీల్‌తో ఉన్న సాన్నిహిత్యాన్ని, అలాగే వీరిద్దరి కాంబినేషన్‌లో రాబోయే డ్రాగన్ సినిమాను గుర్తుచేస్తూ.. ఎన్టీఆర్ పెట్టిన పోస్ట్ ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. ఈ ట్వీట్‌లో ఎన్టీఆర్ స్పందిస్తూ.. 'పుట్టినరోజు శుభాకాంక్షలు డైరెక్టర్ గారూ.. మీరు చెప్పే కథలంత గొప్పగా ఈ ఏడాది మీకు సాగాలని కోరుకుంటున్నాను. మన కాంబినేషన్‌లో రాబోయే ప్రాజెక్ట్ కోసం, మన భవిష్యత్తు ప్రయాణం కోసం నేను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను ప్రశాంత్ అంటూ ఎన్టీఆర్ రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌లో ప్రశాంత్ నీల్‌ను ఉద్దేశించి ఎన్టీఆర్ కన్నడ పదం 'అవరే' (గారూ) అని సంబోధించడం ఇరు భాషల అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. 'కేజీఎఫ్', 'సలార్' వంటి ఇండస్ట్రీ హిట్ చిత్రాలతో సంచలనం సృష్టించిన ప్రశాంత్ నీల్, ఎన్టీఆర్ కాంబినేషన్‌లో రాబోయే భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ డ్రాగన్ పై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రం జూన్ 11న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com